Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 82 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 14 ఏప్రిల్ 2023 | శుక్రవారం | పేజీలు : 4

## 8 వేలకు చేరువలో కొత్త కేసులు..

దిల్లీ: దేశంలో కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. క్రమంగా కేసుల సంఖ్య పెరగటం ఆందోళన కలిగిస్తోంది. కొత్తగా 2,14, 242 మందికి వైద్య పరీక్షలు చేయగా.. 7,830 మందికి వైరస్ సోకినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ముందు రోజు ఐదువేలకు పైగా నమోదైన కొత్త కేసుల సంఖ్య.. ప్రస్తుతం అమాంతం పెరిగింది. ఏడునెలల అత్యధికానికి చేరింది. దాంతో రోజువారీ పాజిటివిటీ 3.65 శాతానికి చేరింది. తాజా వ్యాప్తితో క్రియాశీల కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం వాటి సంఖ్య 40వేల(0.09శాతం)కు చేరింది. రికవరీ రేటు 98.72 శాతంగా నమోదైంది. కేంద్రం 11 మరణాలను ప్రకటిం చగా.. మొత్తంగా 5,31,016 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకూ 220.66 కోట్ల టీకా డోసులు పంపిణీ అయ్యాయి.

# వైసీపీ వర్సస్ బీఆర్ఎస్
# మంత్రుల డైలాగ్ వార్






# టార్గెట్ ఫిక్స్...!!

హైదరాబాద్ / అమరావతి : తెలుగు రాష్ట్రాల్లో కొత్త రాజకీయం మొదలైంది. విశాఖ స్టీల్ ప్లాంట్ బిడ్ లో పాల్గొనాలని తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం..ఇదే సమయంలో తెలంగాణ వర్సస్ ఆంధ్ర మంత్రుల డైలాగ్ వార్ కొత్త సమీకరణాలకు కారణం అవుతోంది. రెండు రాష్ట్రాల మంత్రుల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. రెండు వైపులా డైలాగుల్లో చంద్రబాబు లక్ష్యంగా కనిపిస్తోంది. తెలంగాణ – ఏపీ మంత్రుల మధ్య అసలు ఈ డైలాగ్ వార్ ఇప్పుడు ఎందుకు మొదలైందనే చర్చ వినిపిస్తోంది. రాజకీయంగా పై చేయి సాధించేందుకు రెండు పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో ఎన్నికల వేళ కొత్త పొలిటికల్ గేమ్ మొదలైంది. ఏపీ వర్సస్ తెలంగాణ మంత్రులు..:ఎన్నికలకు సిద్దం అవుతున్న వేళ అన్ని పార్టీలు తమ రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. విశాఖ కేంద్రంగా స్టీల్ ప్లాంట్ బిడ్ లో పాల్గొనాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించటంతో ఏపీ రాజకీయాల్లో చర్చ మొదలైంది. స్టీల్ ప్లాంట్ అధికారులతో సింగరేణి అధికారులు సమావేశం నిర్వహించారు. బిడ్ దాఖలుకు ఈ నెల 15వ తేదీ వరకు సమయం ఉంది. ఇదే సమయంలో బిడ్ కు సంబంధించి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఏపీ మంత్రి అమర్నాధ్ తాము ప్రయివేటీకరణకు వ్యతిరేకమని స్పష్టం చేసారు. ప్లాంట్ బిడ్ లో పాల్గొనటం ద్వారా ప్రయివేటీకరణకు బీఆర్ఎస్ మద్దతుగా నిలుస్తుందా అని ప్రశ్నించారు. ఇదే సమయంలో మంత్రి హరీష్ ఏపీ పైన చేసిన వ్యాఖ్యలతో ఒక్క సారిగా డైలాగ్ వార్ మొదలైంది.

**ఏపీ హెూదా – స్టీల్ ప్లాంట్ పై కామెంట్స్:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మికులు అక్కడ ఓటు హక్కు రద్దు చేసుకుని, తెలంగాణలో పొందాలని, ఆంధ్ర, తెలంగాణలో పాలన చూస్తున్నారు కదా.. ఏది బాగుందో చెప్పాలని మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యల తో ఒక్క సారిగా రాజకీయంగా వాతావరణం హీటెక్కింది. దీనిని ఏపీ మంత్రులు సీరియస్ గా రియాక్ట్ అయ్యారు. దీంతో, హరీష్ మరింతగా తన మాటలకు పదును పెట్టారు. ఏపీకి ప్రత్యేక హెూదాను కేంద్రం ఇవ్వకున్నా.. అక్కడి అధికార పక్షం అడగదు, ప్రతిపక్షం ప్రశ్నించదు.. అని ఎద్దేవా చేశారు. ఇంకా జోక్ ఏందంటే.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షంలో ఉన్న పార్టీ.. ఆనాడు ప్రత్యేక హెూదా కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు వచ్చింది. ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వం, బీజేపీ ప్రాపకం కోసం పాకులాడుతున్న పరిస్థితి మీ రాష్ట్రంలో ఉందంటూ పరోక్షంగా చంద్రబాబును టార్గెట్ చేసారు. ఈ రోజు ప్రజలను గాలికి వదిలేశారు. అధికార, ప్రతిపక్షాలు.. స్వార్థం కోసం పనిచేస్తున్నాయి. మా గురించి ఎక్కువ మాట్లాడకపోతే మీకే మంచిది అంటూ వ్యాఖ్యానించారు.

**టీడీపీ టార్గెట్ –సెటిలర్స్ ఓట్లపై గురి:** హరీష్ వ్యాఖ్యలతో ఏపీ మంత్రులు కౌంటర్ ఇచ్చారు. సచివాలయం, డిఫెన్స్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు... అన్నింటినీ మీకు అప్పచెప్పి... ధనమంతా మీకు వచ్చేలా చేశారు మా చంద్రబాబు అంటూ పరోక్షంగా ఏపీకి నష్టం చేసారనే కోణంలో మంత్రి కారుమూరి టీడీపీ అధినేతను టార్గెట్ చేసారు. మంత్రి బొత్సా సైతం హరీష్ వ్యాఖ్యలపై సీరియస్ గా రియాక్ట్ అయ్యారు. త్వరలో జరిగే తెలంగాణ ఎన్నికల్లో సెటిలర్స్ ఓట్ల పైన గురి పెట్టిన బీఆర్ఎష్.. ఏపీలో అభివృద్ధి కోసం తాము ఆలోచన చేస్తున్నామనే సంకేతాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయంలో తెలంగాణలో తిరిగి బలపడాలని భావిస్తున్న టీడీపీ ప్రయత్నాలకు బ్రేకులు వేస్తున్నారు. గతంలోనూ ఇదే విధంగా ఏపీ – తెలంగాణ మంత్రుల మధ్య మాటలు పేలినా..తరువాత సర్దుకుంది. ఇప్పుడు అదే విధంగా సర్దుకుంటారా...ఎన్నికల వరకు సాగదీస్తారా అనేది చూడాలి.



నేడు హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరణ కానున్న 175 అడుగుల భారీ డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం

# పొంగులేటి, జూపల్లి బాటలో ఆ కీలక నేతలు : కేసీఆర్ ఏం చెయ్యనున్నారు?



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని ప్లాన్ చేసి బలమైన నాయకులను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్న కెసిఆర్ వ్యూహం బెడిసి కొడుతుందా? పార్టీలో పాతా కొత్త నేతల మధ్య ఉన్న విభేదాలు ఎన్నికలు దగ్గరకు వస్తున్న సమయంలో పార్టీకి తలనొప్పిగా తయారయ్యాయా? ఫిరాయింపు ఎమ్మెల్యేలను ప్రోత్సహించడం కెసిఆర్ కు కొత్త తలనొప్పి తెచ్చిపెట్టిందా? అంటే అవును అన్న సమాధానమే వస్తుంది. ఒక పక్క తెలంగాణ రాష్ట్రంలో బలంగా బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ప్రజాక్షేత్రంలోకి వెళుతూ ప్రజల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తుంటే, మరొక బిఆర్ఎస్ ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనే మాట అటు నుంచి స్వపక్షంలోనే ఉన్న అంతర్గత కలహాలతో సతమతమవుతుంది. మొదటి నుంచి బీఆర్ఎస్ కోసం పనిచేసిన నాయకులు, మధ్యలో కాంగ్రెస్, బిజెపి వంటి ఇతర పార్టీల నుండి వచ్చి చేరిన నాయకుల మధ్య ఆధిపత్య పోరు రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాలలో దాదాపుగా కనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో పరిస్థితులు మరీ దారుణంగా తయారయ్యాయి. అక్కడ నేతల మధ్య ఆధిపత్య పోరు పార్టీకి నష్టం చేసేలా కనిపిస్తుంది. వచ్చే ఎన్నికలలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇస్తానని సీఎం కేసీఆర్ క్లారిటీ ఇవ్వడంతో, టికెట్ కోసం ఆశ పెట్టుకున్న గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన బీఆర్ఎస్ నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అయితే కెసిఆర్ అవసరాన్ని బట్టి నిర్ణయం మార్చుకునే అవకాశం కూడా ఉంది అని ఆలోచిస్తున్న వారు, నియోజకవర్గంలో పట్టు కోసం పోటాపోటీగా పనిచేస్తున్నారు. సిట్టింగులకు చెక్ పెట్టి టికెట్ తెచ్చుకోవాలనే ఆలోచనలో ఎవరికి వారు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాలలో పరిస్థితి అధికార పార్టీలోనే నేతల మధ్య ఉప్పు నిప్పులా తయారైంది. ఇక తాజాగా బి ఆర్ ఎస్ పార్టీ నుండి జూపల్లి కృష్ణారావును, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సస్పెండ్ చేయడం, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్చకు కారణమైంది. టిఆర్ఎస్ పార్టీలో చాలామంది అసంతృప్తులు ఉన్నారని, వారందరినీ ఏకతాటి మీద తీసుకువచ్చి బిఆర్ఎస్ ని ఓడించడమే ధ్యేయంగా పనిచేస్తామని జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడంతో ఫిరాయింపు ఎమ్మెల్యేల పైన ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి బి ఆర్ ఎస్ లోకి ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలలో అంతకు ముందు నుండే బి.ఆర్.ఎస్ కోసం కీలకంగా పనిచేస్తున్న నేతలు పక్క చూపులు చూస్తున్నట్లుగా తెలుస్తుంది. ఎన్టీఆర్ కు ద్రోహం చేసిందెవరో ఆత్మసాక్షిని అడుగు– కొడాలి నానికి నందమూరి రామకృష్ణ కౌంటర్ అసమ్మతి నేతలందరూ జట్టు కడితే ఆయా నియోజకవర్గాలలో మొదటికే మోసం వస్తుందని భావిస్తున్న బిఆర్ఎస్ దిద్దుబాటు చర్యలను చేపట్టాలని భావిస్తుంది. పట్నం మహేందర్ రెడ్డి , తీగల కృష్ణారెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వంటి నాయకులు ఇప్పటికే తీవ్రమైన అసహనంతో ఉన్నారు.

ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల ఉన్న నాయకులు అందరూ తమ అసంతృప్తిని బయటపడితే బీఆర్ఎస్ పార్టీకి ఇబ్బందికర వాతావరణ చోటు చేసుకుంటుంది.

కాబట్టి వీరందరిని సముదాయించడానికి, అందరినీ ఏకతాటి మీదికి తీసుకురావడానికి అధినేత కేసీఆర్ ఏం చేయబోతున్నారు అన్నది ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది.



# మళ్ళీ బీజేపీకి చేరికల ఆశ

## హస్తినకు బండి సంజయ్, ఈటల రాజేందర్

హైదరాబాద్ : గత కొంతకాలంగా తెలంగాణ బిజెపిలోకి భారీగా చేరికలు జరుగుతాయని పెద్ద ఎత్తున ప్రచారం జరిగినా అది ఇప్పటివరకు సాధ్యం కాలేదు. ఇక తాజాగా మరో మారు బిజెపి చేరికలపై గంపెడు ఆశ పెట్టుకుంది. తాజాగా బీఆర్ఎస్ పార్టీ నుండి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును సస్పెండ్ చేయడంతో, మళ్లీ బిజెపి చేరికలపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హై కమాండ్ పిలుపుమేరకు హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. తెలంగాణలో చోటు చేసుకున్న తాజా రాజకీయ పరిణామాలపై ఆయన అధినాయకత్వానికి నివేదికను ఇవ్వనున్నారు. ఇదే సమయంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుల చేరికపై ఢిల్లీ పెద్దలతో బండి సంజయ్ చర్చించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే హుజరాబాద్ ఎమ్మెల్యే, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఢిల్లీకి చేరుకోగా, బండి సంజయ్ కూడా ఢిల్లీలో అధినాయకత్వంతో మాట్లాడి చేరికలకు రంగం సిద్ధం చేయనున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ నుండి సస్పెండ్ కు గురైన జూపల్లి కృష్ణారావును, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను బిజెపిలోకి తీసుకురావడానికి బిజెపి సీనియర్ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ జూపల్లి కృష్ణారావును, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బిజెపిలోకి రావాలని ఆహ్వానించారు. ఇక మరోవైపు ఈటల రాజేందర్ కూడా చేరికలపై తన వంతుగా ప్రయత్నాలు చేస్తున్నారు. జూపల్లి కృష్ణారావును, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బిజెపిలో చేర్చుకుంటే పార్టీకి లబ్ది జరుగుతుందని బిజెపి భావిస్తుంది. రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ అసంతృప్త నేతలతో కూడా చర్చించి వారిని కూడా పార్టీలోకి తీసుకురావాలని బిజెపి భావిస్తుంది. ఈ క్రమంలోనే అధినాయకత్వం ఆదేశాల మేరకు తెలంగాణలో బిజెపి చేరికలకు వ్యూహాలను రచిస్తుంది. ఇప్పటికే అనేకమార్లు బీజేపీలోకి చేరికల ప్రళయం రానుందని చెప్పిన బీజేపీ నేతలు చేరికల విషయంలో అభాసు పాలయ్యారు. మరి బిజెపి ప్రయత్నంలో ఈసారైనా బీజేపీ సక్సెస్ అవుతుందా? చేరికలపై బీజేపీ పెట్టుకున్న ఆశలు ఈసారైనా నెరవేరుతాయా? అన్నది పార్టీ శ్రేణుల్లోనూ చర్చ జరుగుతుంది. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో ఇప్పుడు బిజెపిలోకి కీలక నాయకులను తీసుకురాగలిగితే బిజెపి సక్సెస్ అయినట్టేనని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సంపాదకీయం

## చైనాకు చెప్పుదెబ్బ కొట్టే రీతిలో రంగంలోకి దిగిన అమిత్ షా

ఇరుగుపొరుగుతో నిత్యం ఏదో ఒక పంచాయితీ పెట్టుకునే డ్రాగన్ దుర్మార్గ బుద్ధికి నిదర్శనంగా ఒకపక్క తైవాన్ మీద నిప్పులు చెరుగుతున్న చైనా.. మరోవైపు భారత్ తో సహా మరెన్నో దేశాలను ఏదోలా ఇబ్బందులకు గురి చేస్తూ ఉండటం తెలిసిందే. ఈ నెల 2న అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని 11 ప్రదేశాలకు మాండరీన్ పేర్లను పెడుతూ చైనా విపరీత చర్యకు దిగింది. అంతేకాదు.. అరుణాచల్ ప్రదేశ్ ను దక్షిణ టిబెట్ గా చూపిస్తున్న మ్యాప్ ను విడుదల చేశారు. దీనిపై భారత్ అభ్యంతరం చెప్పినా పట్టించుకున్నది లేదు. ఇలాంటి వేళ.. మోడీ సర్కారు చైనాకు చెప్పుదెబ్బ కొట్టే తరహాలో నిర్ణయాన్ని తీసుకుంది. తాజాగా అరుణాచల్ ప్రదేశ్ లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనను ఖరారు చేసింది. చైనా సరిహద్దున ఉండే కిబితూ గ్రామంలో వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రాంను ప్రారంభించేందుకు రంగంలోకి దిగారు అమిత్ షా. ఇందులో భాగంగా ఇప్పటికే ఆయన అసోంలోని దిబ్రూగడ్ కు చేరుకున్నారు. అరుణచల్ ప్రదేశ్ లో అమిత్ షా పర్యటన రెండు రోజులు సాగనుంది. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు అమిత్ షా. ఇలాంటి వేళ.. ఒక మీడియా సంస్థ చైనా విదేశాంగ ప్రతినిధి వాంగ్ ను అమిత్ షా పర్యటన గురించి ప్రశ్నించింది. దీనికి ఆయన స్పందిస్తూ జాంగ్ నన్ చైనా భూభాగమన్నారు. జాంగ్ నన్ అన్నంతనే ఇదెక్కడి పేరు.. చూస్తుంటే చైనాదే అని అనుకోవచ్చు. అరుణాచల్ ప్రదేశ్ కు చైనావోడు పెట్టుకున్న పేరు అది. "భారత అధికారులు పర్యటించటం మా భౌగోళిక సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించటమే అవుతుంది. ఈ చర్య శాంతికి ఏ మాత్రం తోడ్పడదు" అంటూ వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యాఖ్యలకు ఘాటైన రీతిలో సమాధానాలు ఇచ్చేందుకు వీలుగా మోడీ సర్కారు నడుం బిగించటమే కాదు.. చేతల్లో చూపించే పనిని మొదలు పెట్టింది. తాజాగా చేపట్టిన అమిత్ షా పర్యటనలో భాగంగా తొమ్మిది మైక్రో హైడల్ ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అంతేకాదు.. అరుణాచల్ ప్రదేశ్ తో పాటు సిక్కిం.. ఉత్తరాఖండ్.. హిమాచల్ ప్రదేశ్ కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్ లోని 19 జిల్లాల్లోని బ్లాక్ లో పలు డెవలప్ మెంట్ కార్యక్రమాల్ని ఈ సందర్భంగా చేపట్టనున్నారు. డ్రాగన్ దుర్మార్గ బుద్ధికి ఈ మాత్రం బదులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పాలి.

# మనోహరాబాద్ టు కొడకండ్లకు చుక్‌చుక్



గజ్వేల్ : మనోహరాబాద్ టు కొడకండ్ల రైల్వే లైన్ వందశాతం పూర్తయింది. వచ్చే నెలలోనే గూడ్స్ రైలు పట్టాలపై కూత పెట్టనుంది. మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు 151.50 కిలోమీటర్ల మేర నిర్మించనున్న రైల్వే ట్రాక్‌లో 43 కిలోమీటర్ల మేర పూర్తయింది. ఇప్పటికే పలుమార్లు దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషన్ అధికారులు రైలు ఇంజన్, రైలు బోగీలు, గూడ్స్ రైలు, ప్యాసింజర్ రైళ్లతో ట్రయల్‌రన్‌ను నిర్వహించారు. ఇటీవల ప్యాసింజర్ రైలుతో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ట్రయల్ రన్‌ను నిర్వహించిన అధికారులు వచ్చే నెల నుంచి గూడ్స్ రైలు రాకపోకలకు సేఫ్టీ కమిషన్ అధికారులు అనుమతినిచ్చినట్లు తెలిసింది. అంతేకాకుండా ప్యాసింజర్ రైలుకు త్వరలోనే గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రూ.1,161 కోట్ల వ్యయంతో 151.50 కిలోమీటర్ల మేర నిర్మించనున్న కొత్త రైల్వే లైన్‌లో ఇప్పటికే 43 కిలోమీటర్ల మేర పనులు పూర్తయి, రైలు రాకపోకలకు మార్గం సుగమమయ్యింది. అంతేకాకుండా కొడకండ్ల నుంచి దుద్దెడ వరకు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో ఇప్పటివరకు రోడ్డు మార్గం మినహా రైలు మార్గం లేదు. ఈ రైల్వేలైన్ పూర్తయితే మెదక్, సిద్దిపేట, సిరిసిల్లా, కరీంనగర్ జిల్లాలకు రైలు మార్గం అందుబాటులోనికి రానుంది. అంతేకాకుండా ప్రముఖ పుణ్యక్షేత్రాలైన నాచారం లక్ష్మీనర్సింహస్వామి, కొమురవెల్లి మల్లికార్జునస్వామి, వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయాలు ఈ లైన్‌కు ఆనుకుని ఉండనున్నాయి. ఈ రైల్వే లైన్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2021 ఎకరాల భూమిని సేకరించి, రైల్వే శాఖకు అప్పగించింది. అంతేకాకుండా కాజీపేట రైల్వే స్టేషన్‌పై భారం తగ్గించేందుకు ఈ రైల్వేలైన్ మార్గం తోడ్పడనుందని రైల్వేశాఖ అధికారులు చెబుతున్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు నిర్మించనున్న ఈ రైల్వేలైన్... అనంతరం కొత్తపల్లి నుంచి పెద్దపల్లి వరకు ఉన్న లింక్‌తో మహారాష్ట్రలోని బల్లార్షా మీదుగా న్యూఢిల్లీ వరకు రైలు మార్గం ఏర్పడనుంది. దీంతో రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ నుంచి దేశరాజధాని న్యూఢిల్లీకి మార్గం సుగుమం కావడంతో పాటు జాతీయ లైన్‌గా మారనుంది. మొత్తంగా గజ్వేల్, కొడకండ్ల వరకు రైల్వేలైన్ పూర్తి కావడం, పలు మార్లు రైలు రాకపోకలు జరుగుతుండడంతో స్థానిక ప్రజల్లో హర్షాతిరేకలు వ్యక్తమవుతున్నాయి. రైలు రాకకు, రైల్వేలైన్ పూర్తికావడానికి ఎంతగానో శ్రమించిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి గజ్వేల్ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# టెట్.. సాధించేట్లు



సిద్దిపేట : టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు(టెట్)లో అర్హత సాధించాలంటే ఆషామాషీ కాదు. హైదరాబాద్‌లో పేరొందిన కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లు, రూములు, స్టడీహాళ్లు, మెటీరియల్ అన్నీ గుర్తుకొస్తాయి. వీటికి కావాల్సిన ఆర్థిక వనరులు సైతం ఆందోళనను కలిగిస్తాయి. పేదవాళ్లకు ఈ శిక్షణ ఆర్థికంగా శిక్ష లాంటిదే. ఇలాంటి విద్యార్థుల కోసం మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటలో ఉచిత టెట్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు. 2015వ సంవత్సరంలో మొదటిసారి మంత్రి హరీశ్‌రావు కేసీఆర్ కోచింగ్ సెంటర్‌కు శ్రీకారం చుట్టారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారిలో గ్రూప్-2లో 24 మంది అర్హత సాధించగా, 8 మంది ఎస్‌ఐలుగా, 150 మంది కానిస్టేబుళుల్గా, 75 మంది ఉపా?ధ్యాయులుగా ఎంపికయ్యారు. టెట్ శిక్షణలో 80 శాతం అర్హత సాధించారు. నిపుణులతో ఉచితంగా బోధనవరుస నోటిఫికేషన్లు వెలువరిస్తున్న క్రమంలో రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాల్లో పోలీస్, గ్రూప్స్ పరీక్షల కోసం ఉచిత శిక్షణ కేంద్రాలను ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి సిద్దిపేటలోనూ పోలీస్ కోచింగ్ చేపట్టారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన టెట్ ఉచిత కోచింగ్ సెంటర్ రాష్ట్రంలో ఏకైక కేంద్రం. నిపుణులైన 18 మంది ఫ్యాకల్టీ 60 రోజుల పాటు బోధించనున్నారు. వారికి హరీశ్‌రావు గౌరవ వేతనం ఇస్తున్నారు.

సరైన శిక్షణ.. సకల సౌకర్యాలుఈ కోచింగ్ సెంటర్‌ను కఠిన నిబంధనలతో నిర్వహిస్తున్నారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 7గంటల వరకు క్లాసులు జరుగుతాయి. నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరు. సెల్‌ఫోన్ రింగైతే చాలు దానిని నీళ్లు నింపిన డబ్బాలో పడవేయడమే. వరుసగా రెండు రోజులు తరగతులకు రాకుంటే వారి పేరును తొలగిస్తున్నారు. ప్రస్తుతం 600 మందిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రోజువారీగా రెండు పూటలు హాజరు తీసుకుంటారు. ఐడీ కార్డు ఉంటేనే అనుమతి. త్వరలోనే రోజువారీ మాక్ టెస్టుల నిర్వహణకు ప్లాన్ చేస్తున్నారు. నిపుణులతో సిద్ధం చేయించిన స్టడీ మెటీరియల్‌ను పది రోజుల్లో ఉచితంగా అందజేయనున్నారు. ఈ కేసీఆర్ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలను కల్పించారు. నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందజేస్తున్నారు. ఎండాకాలం కావడంతో క్లాసులను నిర్వహించే హాల్‌లో 4 భారీ కూలర్లు అమర్చారు. చల్లటి నీళ్లను అందుబాటులో ఉంచారు. రెడీమెడ్ టాయిలెట్లతోపాటు మొబైల్ టాయిలెట్ బస్సును ఏర్పాటు చేయించారు.

ఇక్కడ చేరాక నమ్మకం కలిగిందినేను బీఈడీ పూర్తి చేశాను. గతంలో ఒకసారి టెట్ అర్హత పరీక్ష రాసినప్పటికీ క్వాలిఫై కాలేదు. నాకు ఇద్దరు పిల్లలు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపనతో ఇక్కడకు చేరాను. సార్లు అద్భుతంగా చెబుతున్నారు. టెట్‌లో మంచి మార్కులు వస్తాయనే నమ్మకం కలిగింది. క్రమం తప్పకుండా వస్తున్నాను.- కల్యాణి, పెద్దకోడూరు

హరీశన్నకు రుణపడి ఉంటాంరెండేళ్ల కిందట బీఈడీ పూర్తయ్యింది. మా ఊరిలోనే టెంట్ హౌస్ నడుపుతున్నాం. ఉచిత కోచింగ్ అనగానే నేను పట్టించుకోలేదు. మా ఫ్రెండ్స్ చెప్పగానే ఇక్కడకు వచ్చాను. నాకు కాన్ఫిడెన్స్ పెరిగింది. ఎలాగైనా ఉద్యోగం సాధిస్తాను. మంచి బోధనతోపాటు చక్కని భోజనం పెడుతున్న హరీశన్నకు రుణపడి ఉంటాం.- మహ్మద్ రఫీ, చింతమడక

కమిట్‌మెంట్‌తో నిర్వహిస్తున్నారునాకు హైదరాబాద్‌లో సొంతంగా మ్యాథ్స్ అకాడమీ ఉంది. రోజుకు 8 బ్యాచ్‌లకు చెబుతాను. తీరిక ఉండదు. కానీ పేదవాళ్ల కోసం హరీశ్‌రావు సార్ చేస్తున్న కృషికి కొంతైనా తోడ్పాటు అందించాలని అనుకున్నా. ఇక్కడి నిర్వాహకులు అడగగానే కాదనలేదు. ఇలా కమిట్మెంట్‌తో నిర్వహించడం గొప్ప విషయం. వందశాతం ఫలితాలు వచ్చేలా పిల్లలను తీర్చిదిద్దుతాం. - మహేశ్, మ్యాథమెటిక్స్ నిపుణుడు

# అంగట్లో అసైన్డ్ భూములు

గజ్వేల్ : రూ. కోట్లు విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన వీఆర్వోలు లేకపోవడం కబ్జాల బారినపడుతున్నాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు భూములను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం రిజిస్ట్రేషన్లకే పరిమితమైంది. స్థానికులు ఫిర్యాదు చేసినప్పుడు మండలస్థాయి అధికారులు హడావుడిగా చర్యలు తీసుకుంటున్నారు. ఆ తరువాత పట్టించుకోవడం లేదు. భారీగా పెరిగిన భూముల విలువరాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న నర్సాపూర్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్ భూములున్నాయి. పట్టణం వేగంగా విస్తరిస్తుండటంతో భూముల ధరలు హైదరాబాద్‌తో పోటీపడుతున్నాయి. పట్టణం చుట్టూ పట్టాభూములకన్నా ప్రభుత్వ, వక్ఫ్ భూములే అధికంగా ఉన్నాయి. దీంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పాటు నాయకుల ముసుగులో అక్రమార్కులు ఆ భూములను ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్నారు. అసైన్డ్ భూముల విక్రయాలు నర్సాపూర్ పట్టణం హెచ్‌ఎండీఏ పరిధిలోకి రాకముందు అప్పటి ప్రభుత్వాలు అసైన్డు కమిటీలల ద్వారా నిరుపేదలకు వందల ఎకరాలు పంపిణీ చేశారు. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములను సాగుచేసుకుని జీవనం సాగించాలి కానీ విక్రయించడానికి అనుమతి లేదు. భూముల ధరలు పెరగడంతో నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమల క్రయవిక్రయాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. హైదరాబాద్-మెదక్ హైవే, సంగారెడ్డి-తూప్రాన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న అసైన్డ్ భూములు వ్యవసాయేతర భూములుగా, వాణిజ్య అవసరాలుగా మారిపోతున్నాయి. రికొన్నిచోట్ల పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఇళ్లు నిర్మించి రూ. లక్షలకు విక్రయిస్తున్నారు. మరికొందరు ప్రభుత్వ భూముల్లోనే నిర్మాణాలు చేపట్టి అనంతరం జీవో 58, 59 ప్రకారం క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడం విశేషం.

# మాడుతున్న కూలీలు

గద్వాల : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉపాధి కూలీలు ఎండ బారిన పడుతున్నారు. పని ప్రదేశంలో నీడ కల్పించాల్సిన అధికారులు చేతులెత్తేయడంతో మాడిపోతున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచి నీటిని కూడా అందించకపోవడంతో వడదెబ్బ బారిన పడుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో దాదాపు 35 వేల మంది కూలీలు రోజూ ఉపాధి పనులకు హాజరవుతున్నారు. యాసంగిలో వరి వేయొద్దని ప్రభుత్వం చెప్పడంతో వ్యవసాయ పనులు తగ్గి, ఉపాధి పనులకు డిమాండ్ పెరిగింది. ప్రతీ మండలంలో మూడు వేల నుంచి నాలుగు వేల మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు. కూలీలకు తగ్గట్లుగా ఉపాధి సిబ్బంది పనులు కల్పిస్తున్నారు. భూ అభివృద్ధి పనులతో పాటు, కంప తొలగింపు, ఫీడర్ చానల్స్, డిస్ట్రిబ్యూటర్లలో సిల్ట్ తొలగింపు, చెరువుల్లో పూడికతీత తదితర పనులు చేయిస్తున్నారు.44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. 43 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాల్పులు సెగలు పుట్టిస్తున్నాయి. ఉదయం 10 దాటిందంటే వేడి గాలులు వీస్తున్నాయి. అయినా పొట్ట కూటి కోసం జనం ఎండను సైతం లెక్క చేయకుండా పనులకు వస్తుంటే, అధికారులు మాత్రం నీడ కల్పించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.కనిపించని షేడ్ నెట్లు, మెడికల్ కిట్లువేసవిలో పనులు చేసే ప్రదేశంలో కూలీలు ఎండ నుంచి ఉపశమనం పొందడానికి, మంచి నీరు తాగడానికి షేడ్ నెట్లు వేసి ఉంచాలి. మంచి నీటిని అందుబాటులో ఉంచాలి. కానీ జిల్లాలో ఎక్కడా ఇలాంటి చర్యలు చేపట్టడం లేదు. పని ప్రదేశంలో గాయపడిన, అనారోగ్యానికి గురైన వారి కోసం మెడికల్ కిట్టును అందుబాటులో ఉంచాలి. వడదెబ్బకు గురైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీటిలో కలిపి తాపించాలి. కానీ ఎక్కడా మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో లేవు. పని ప్రదేశంలో ఇప్పటికే చాలా మంది గాయపడటంతో పాటు వడదెబ్బ బారిన పడి, ఆస్పత్రుల



పాలయ్యారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోడంపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదనపు భత్యం గాయబ్‌వేసవిలో భూమి గట్టిగా ఉండటంతో శారీరక శ్రమ అధికంగా ఉండటంతో పాటు, పని తక్కువగా ఉంటుంది. పని తక్కువగా కావడంతో సరైన కూలి లభించదు. అందుకే ప్రభుత్వం ఏటా వేసవిలో 20 నుంచి 40 శాతం అదనంగా భత్యం ఇచ్చేది. అదేవిధంగా మంచినీటి బాటల్‌కు, సొంతంగా తెచ్చుకున్న పనిముట్లకు డబ్బులు ఇవ్వాలి. కానీ కేంద్రం ఆదేశాల మేరకు ప్రభుత్వం కొత్తగా తెచ్చిన సాఫ్ట్‌వేర్‌లో ఇవేవీ కనిపించకపోవడంతో కూలీలు వాటిని పొందలేక పోతున్నారు. గతంలో రోజుకు రూ.256 కూలీ పడుతుండగా, ఇప్పుడు రూ.100 కూడా పడటం లేదని కూలీలు వాపోతున్నారు.నిలువ నీడలేదుఉదయం పనికి వచ్చాము. ఎండదంచి కొడుతోంది. పెదవులు తడారిపోతున్నాయి. దూప అయి కూర్చోని నీళ్లు తాగుదామంటే నీడలేదు. తెచ్చుకున్న బాటల్ నీళ్లు అయిపోయాయి. నీళ్లు కూడ లేవు.- ఎమేలమ్మ, ఉపాధి కూలీ, మేలచెరువువిడి పనిముట్లు లేవుప్రభుత్వం విడి పనిముట్లను ఇవ్వడం లేదు. మేము తెచ్చుకున్న పనిముట్లకు ఎలాంటి డబ్బులు ఇవ్వడం లేదు. మేము వాటిని కొలిమి పెట్టించుకొని వస్తున్నాము. అదనంగా మాకు ఖర్చవుతుంది. - ఏహెూన్, ఉపాధి కూలీ, మేలచెరువు

# కృష్ణానది మీదుగా మరో జాతీయ రహదారి

కొల్లాపూర్ : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్వెన వరకు 167 జాతీయ రహదారికి నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, తాజాగా కొల్లాపూర్ నియోజకవర్గంలో కృష్ణానది మీదుగా మరో జాతీయ రహదారిని నిర్మించాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ రాములు ప్రతిపాదనలు అందించారు. ప్రతిపాదనలు ఏంటి?కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన గ్రామ అభ్యుదయ సేవా సంస్థ అధ్యక్షుడు బండి వెంకట్‌రెడ్డి కొన్నేళ్లుగా రిటైర్డు ఇంజనీర్ నిపుణులతో సిద్ధం చేసిన ప్రతిపాదన ఇలా ఉన్నాయి. కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి చౌరస్తా నుంచి బూడిదపాడు, లింగనవాయి, భీమవరం మీదుగా గద్వాల జిల్లా జోగులాంబ ఆలయం, అలంపూర్ చౌరస్తా వరకు 22 కిలో మీటర్ల దూరం ఉంటుంది. అందు కోసం కృష్ణానదిపై ఏడు కిలో మీటర్ల మేర వంతెనతో పాటు 15 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది. హైదరాబాద్, బెంగళూరు నేషనల్ హైవే 44ను, 167 కొల్లాపూర్, 765 హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారికి లింక్ చేస్తూ ఈ ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనల గురించి బండి వెంకట్‌రెడ్డి నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు దృష్టికి తీసుకెళ్లగా, ఎంపీ ఈ నెల 11న కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి అందించారు. ఇది కేంద్రం పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

ఎంటి లాభం?ప్రస్తుతం కొల్లాపూర్ నుంచి కర్నూల్‌కు పెబ్బేరు మీదుగా వెళ్లాలంటే 107 కిలో మీటర్ల దూరం అవుతుంది. ఈ రహదారి నిర్మాణం జరిగితే 55కిలో మీటర్ల దూరం తగ్గుతుంది.అలంపూర్ చౌరస్తా నుంచి కొల్లాపూర్ మీదుగా అచ్చంపేటకు వెళ్లాలంటే ప్రస్తుతం 160 కిలో మీటర్ల దూరం అవుతుంది. కొత్తగా ప్రతిపాదించిన జాతీయ రహదారి నిర్మాణం జరిగితే 88 కిలో మీటర్ల దూరం అవుతుంది. విజయవాడ వెళ్లే ప్రయాణీకులకు దాదాపు 70 కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే కొల్లాపూర్ మరింత అభివృద్ధి చెందుతుందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

కొల్లాపూర్ దశ మారుతుందికొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి చౌరస్తా నుంచి అలంపూర్ చౌరస్తా వరకు 22కిలో మీటర్ల మేర కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే కొల్లాపూర్ దశ మారుతుంది. కొల్లాపూర్ అభివృద్ధి కోసం ఎల్లూరు గ్రామ అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రతిపాదనలు చేయించాం. - బండి వెంకట్‌రెడ్డి, గ్రామ అభ్యుదయ సేవా సంస్థ అధ్యక్షుడు

కేంద్రాన్ని ఒప్పించేందుకు కృషి చేస్తాకొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎలాంటి ప్రతిపాదనలు ఉన్నా, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా. సోమశిల-సిద్ధేశ్వరం వంతెన సాధించినట్టే మరో జాతీయ రహదారితోపాటు కొల్లాపూర్‌కు రైల్వే లైన్ మంజూరు చేయించేలా కృషి చేస్తా. కొల్లాపూర్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం.- ఎల్లేని సుధాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

# ఇంకుడుగుంత.. తీరును నీటి చింత

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండి ఉండటంతో భూగర్భ జలాలకు ఇబ్బంది లేనప్పటికీ.. భవిష్యత్తు తరాలకు కరవు వచ్చిన సందర్భంలో ఇంకుడుగుంతలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రస్తుతం వీటి నిర్మాణ విషయంలో నగర, పురపాలికలు అవగాహన కల్పించకపోవడంతో కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారు ఆసక్తి చూపించడం లేదు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ఐదేళ్లుగా కొంతమేర ముందడుగు వేస్తుండగా మిగతా పట్టణాల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

అనుమతులకు తప్పని ఫీజు..

కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో భవన అనుమతులు తీసుకునే సమయంలో ఇంకుడుగుంతల నిర్మాణ ఫీజు వసూలు చేస్తున్నారు. చదరపు మీటరుకు రూ.25 చొప్పున లెక్కిస్తుండగా ఒక్కో నిర్మాణానికి కనీసం రూ.1500 నుంచి రూ.2500, అపార్టుమెంట్లకు అయితే రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు ఫీజు వేస్తున్నారు. ఇంటి నిర్మాణంతోపాటు ఇంకుడుగుంత నిర్మించుకుంటే ఆ ఫీజు మొత్తాన్ని వెనక్కి ఇస్తారు. ఇలా ఒక కరీంనగర్ నగర పాలికలోనే రూ.1.50 కోట్లు వసూలు చేసిన మొత్తం నిల్వ ఉన్నట్లు సమాచారం. బహుళ అంతస్తుల యజమానులు నిర్మించకపోతే మార్టిగేజ్ విడుదల చేసే అవకాశముండదు.

స్మార్టుసిటీలో చకచకా నిర్మాణాలు

స్మార్టుసిటీ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల్లో ఇంకుడుగుంతలు నిర్మించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. రూ.5.62 కోట్లతో 104 ప్రాంతాల్లో నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. నూతన



విధానంతో వీటిని నిర్మిస్తుండగా ఇప్పటికే నాలుగైదు చోట్ల పూర్తి చేశారు.

అవగాహన పెరగాలి

ఇంకుడుగుంతల నిర్మాణ విషయంలో ప్రజలకు అవగాహన పెంచా ల్సిన అవసరముంది. ఐదారు ఏళ్ల కిందట భూగర్భ జలాలు పెంచే దుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఇంకుడుగుంతలు తవ్వే కార్యక్రమాన్ని తీసుకున్నారు. ఆ సమయంలో రూ.1.20 కోట్లతో డివిజన్ల వారీగా ఇంకుడు గుంతలు నిర్మించేందుకు టెండర్లు పిలిచి నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఆ వైపు కన్నెత్తి చూడటంలేదు.

కాగితాల్లోనే ప్రణాళికలు..

వర్షాకాలంలో కురిసే వాన నీటిని నేరుగా భూమిలోకి పంపించినట్లయి తే భూగర్భ జలాలు పెరిగే అవకాశముంటుంది. ఇంకుడుగుంతలు నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండేళ్లుగా కార్యాచరణ తీసుకుంటుండగా ఆచరణలో మాత్రం ఉండటం లేదు. జల్‌శక్తి అభియాన్ కింద లక్ష్యం విధించినప్పటికీ ఆశించిన ప్రగతి అంతంతా మాత్రంగా ఉంది. ఎక్కువగా ప్రభుత్వ స్థలాలు, భవనాలు, కళాశాలలు, ప్రజాప్రతినిధుల ఇళ్లు, ఫిల్టర్‌బెడ్లు, చేతిపంపులు ఉన్న చోట ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా సీసీ రోడ్లు వేస్తుండగా కనీసం నీరు ఇంకేందుకు స్థలం వదలడం లేదు. భూమి మీద పడిన ప్రతి నీటి బొట్టు డ్రైనేజీల్లోకి వెళ్తుంది.

ఆరేళ్ల కిందట నిర్మాణంతో ప్రయోజనం

ఆరేళ్ల కిందట బల్దియా ఆధ్వర్యంలో నిర్మించిన ఇంకుడుగుంత ఎంతో ప్రయోజనకరంగా ఉంది. వర్షం, ఇల్లు కడిగిన వృథా నీరంతా అందుల్లోకే వెళ్తోంది. చుట్టూ 500 అడుగుల మేర బోర్‌వెల్స్ ఉ ండగా మా వీధిలో మాత్రం 150 అడుగులకే నీరు ఉంటాయి. నిర్మించుకున్నప్పటి నుంచి బోరులో ఫ్రెషర్‌గా నీరు పోస్తుంది. విష్ణువర్ధన్, వావిలాలపల్లి, కరీంనగర్

ప్రజలను ప్రోత్సహించాలి

ఇంకుడుగుంతల ఆవశ్యకతపై ప్రజలను ప్రోత్సహించాలి. పదేళ్ల కిందట నీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఒక రోజు నల్లా నీరు రాకపోతే అవస్థలు పడేవారు. కొత్తగా ఇల్లు, బహుళ అంతస్తులు ఏవీ కట్టినా సరే దీనిని నిర్మించాలనే నిబంధన తప్పనిసరి చేయాలి. దీని నిర్మాణంతో రెండేళ్లుగా ఇంట్లో నీటి లెవల్స్ పెరిగాయి.

వొంటెల సత్యనారాయణరెడ్డి, కరీంనగర్

కొత్త నిబంధన అమలు

కరీంనగర్‌లో 200 చ.మీ పైబడిన విస్తీర్ణంలో ఇంటిని నిర్మిస్తే కచ్చితం గా ఇంకుడుగుంత నిర్మించాలనే కొత్త నిబంధన వచ్చే నెల నుంచి అమల్లోకి తీసుకొస్తాం. అపార్టుమెంట్ తరహాలో వీటికి కూడా నిర్మించ కపోతే మార్టిగేజ్ విడుదల చేయం. ఇళ్లలో దీనిని నిర్మించుకుంటే నగరపాలిక తరపున కుటుంబసభ్యులతో ఫొటో, సర్టిఫికెట్ ఇచ్చి సన్మానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

## ప్రణాళిక సిద్ధం..యంత్రాంగం సన్నద్ధం

గరిడేపల్లి : వేసవి తాపం తట్టుకుని సక్రమంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు దక్షిణ మండలి విద్యుత్తు పంపిణీ సంస్థ (టీఎస్‌పీడీసీఎల్) ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ప్రత్యేక ప్రణాళిక రూపొందించి తదనుగుణంగా పనులు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.10 కోట్ల అంచనాతో అదనపు నియంత్రికలు, లైన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. వేసవిలో మూడు నెలల పాటు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం విపరీతంగా ఉంటుంది. ఇప్పటికే ఎండల తీవ్రతకు పగలు రాత్రి తేడా లేకుండా ఏసీలు వాడుతున్నారు. ఇలాంటి సమయంలో వినియోగం పెరిగినా ఎక్కడా సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అందుకే వేసవి ప్రత్యేక ప్రణాళిక చేపట్టారు. మండలాల వారీగా ఎక్కడెక్కడ ఓవర్‌లోడ్ ఉంది, అదనంగా కనెక్షన్‌లు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయి, మున్సిపాలిటీలో లోడ్, తదితర అంశాలను సేకరించారు. వాటి ఆధారంగా ఎన్ని నియంత్రికలు, అదనపు లైన్లు కావాలో ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరు చేయించారు. ఉమ్మడి జిల్లాలో రూ.10 కోట్ల మేర పనులకు నిధులు మంజూరయ్యాయి. నల్గొండ జిల్లాలో 4,78,517, సూర్యాపేట జిల్లాలో 3,18,490 సర్వీసులున్నాయి.

లోడ్ పెరుగుతోందిలా...వేసవిలో పంటలు చేతికి వచ్చే తరుణంలో ఏప్రిల్ చివరి వరకు విద్యుత్తు వినియోగం ఎక్కువగానే ఉంటుంది. మే, జూన్ మాసాల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడకం అధికంగా ఉండి భారీగానే పెరుగుతుంది. దీనికి తోడు శీతలపానీయాల, జ్యూస్‌లు నిల్వ చేసే ఫ్రిజులు, కూలింగ్ యంత్రాల వినియోగం పగలు అధికంగానే ఉంటుంది.

# నిషేధం అమలెక్కడ!



కరీంనగర్ : మానవ అవసరాలు తీర్చేందుకు ఆవిష్కరించిన ప్లాస్టిక్ నిత్యావసర వస్తువుగా మారి మానవాళికి సవాలు విసురుతుంది. 75 మైక్రాన్ల కన్నా తక్కువ గల ప్లాస్టిక్ కవర్లను వాడవద్దని నిత్యం పురపాలికల్లో చెత్తసేకరణ వాహనాల మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. అయినప్పటికీ నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కాలనీల్లోని ఖాళీ స్థలాలు, మురుగు కాల్వలు, రహదారుల పక్కన ఎక్కడ చూసినా రంగురంగుల ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నారు. దీంతో కాల్వలు పూడుకుపోయి మురుగు నీరు వెళ్లక దుర్గంధం వ్యాప్తిస్తుంది. ప్రచారాలు, అవగాహన కల్పిస్తున్నప్పటికీ మార్పు రావడం లేదు. పురపాలికల్లో ప్లాస్టిక్ నిషేధానికి చేపట్టిన చర్యలపై బృందం పరిశీలించింది. ఆ వివరాలు..

తూతూమంత్రంగానే..

మెట్‌పల్లి బల్దియా పరిధిలో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా జరుగుతోంది. బల్దియా అధికారులు దుకాణాలలో తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు సుమారు 350 దుకాణాలలో తనిఖీలు చేసి 270 కిలోల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు సుమారు రూ.62 వేల వరకు జరిమానా విధించారు. ఈవిషయంపై బల్దియా కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను వివరణ కోరగా ప్లాస్టిక్ నివారణకు కృషి చేస్తున్నామన్నారు. నిత్యం చెత్తసేకరణ ఆటోలతో ప్రచారం చేస్తూనే, వార్డులలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, జరిమానాలు విధిస్తున్నామనారు. ప్రస్తుతం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, కఠిన చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. మెట్‌పల్లి

60 కేసులు.. రూ.2 లక్షల జరిమానా

పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమలు పూర్తిగా విఫలమవుతోంది. యథేచ్ఛగా ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదనే నిబంధన ఉన్నా వినియోగం పెరుగుతూనే ఉంది. గత ఏడాదిలో మొత్తం 6 టన్నుల ప్లాస్టిక్‌ను పురపాలక అధికారులు సీజ్ చేశారు. 60 కేసులు నమోదు చేసి రూ.2 లక్షల మేరకు వ్యాపారులకు జరిమానాలు విధించారు. దాడుల సమయంలో వారం రోజులు స్తబ్దుగా ఉంటున్న వ్యాపారులు ఆ తరువాత యథావిధిగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ప్రజల్లోనూ అవగాహన కొరవడటంతో అందరూ ప్లాస్టిక్‌పైనే ఆధారపడుతున్నారు. బల్దియాలో పారిశుద్ధ్య అధికారులు, పర్యావరణ అధికారి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టలేకపోతున్నారు. ప్లాస్టిక్ కారణంగా కాల్వల్లో చెత్త పేరుకుపోయి మురుగునీరు బయటకు వెళ్లలేక దుర్గంధం వ్యాపిస్తోంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతోంది. జగిత్యాల

నారసంచుల పంపిణీ

రాయికల్ పట్టణంలో ప్లాస్టిక్, కిరాణ, కూరగాయలు, మాంసం విక్రయ కేంద్రాలు, పండ్ల దుకాణాలు వంటి సుమారు 600 వరకు వర్తక, వాణిజ్య కేంద్రాలు ఉండగా 18,000 జనాభా ఉన్నారు. పుర అధికారులు తరచూ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీలు, అవగాహన సమావేశాలు నిర్వహించడంతోపాటు చెత్త సేకరణ వాహనాల ద్వారా మైకుల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. దాతల సహకారంలో నారసంచులు పంపిణీ చేశారు. ఇప్పటివరకు జరిమానాల రూపంలో రూ.25 వేల ఆదాయం సమకూరింది. ప్లాస్టిక్ విక్రయాలపై కమిషనర్ సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా తరచూ తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. విక్రయాలు జరిపితే మున్సిపల్ చట్టాల మేరకు కేసులు నమోదు చేయడంతోపాటు దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.రాయికల్ పట్టణం

నామమాత్రపు తనిఖీలు

పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అమ్మవద్దని, వినియోగించవద్దని ప్రచారం చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. కూడళ్ల వద్ద బోర్డులను ఏర్పాటు చేశారు. వారంలో ఒకటి, రెండు సార్లు మున్సిపల్ సిబ్బంది నామమాత్రపు తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని జరిమానాలు విధిస్తున్నారు. కొన్నినెలల్లోనే వంద కిలోలకుపైగా ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని రూ.లక్షపైగా జరిమానా విధించారు. పండ్ల, కూరగాయల, కిరాణం, ఇతర దుకాణదారులు నిత్యం నిషేధిత ప్లాస్టిక్ కవర్లలోనే సరకులను విక్రయిస్తున్నారు. వస్త్ర సంచులను వాడాలని ఆదేశాలు జారీచేస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. మొక్కుబడి తనిఖీలు కాకుండా నిత్యం పకడ్బందీగా దాడులు నిర్వహించి కఠిన చర్యలు చేపడితే సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుకు నోచుకుంటుంది. కోరుట్ల

దేవస్థానంలో కాగిత కవర్లు..

ధర్మపురి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో భక్తుల తాకిడి అధికంగా ఉంటోంది. దేవస్థానంలో ప్రసాదాలకు కాగితాల కవర్లనే వినియోగిస్తున్నా, కొబ్బరికాయలు, ఇతరత్రా వస్తువులన్నీ ప్లాస్టిక్ కవర్లలోనే విక్రయిస్తున్నారు.

వారసంతలో కూడా ప్లాస్టిక్ కవర్లను అధికంగా వాడుతున్నారు. అడపాదడపా పుర అధికారులు దాడులు చేస్తున్నా, అంతగా ఫలితాలు ఇవ్వడం లేదు. నదీ తీరంలో గంగమ్మకు మొక్కులు సమర్పించే సమయంలోనూ వీటి వినియోగం అధికంగా ఉంది. దీంతో నదీ తీరంలో ఎటు వైపు చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. ఈ విషయమై పుర కమిషనర్ సీహెచ్ రమేష్ మాట్లాడుతూ.. పట్టణంలోని వ్యాపార సంస్థలు, ఇతరత్రా దుకాణాలపై దాడులు చేస్తున్నామని, గత నెల రోజుల్లో రెండు వ్యాపార సంస్థలకు జరిమానా విధించామన్నారు. 4 కిలోల ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామగ్రిని స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. ధర్మపురి

# నత్తనడకన మూలవాగు సుందరీకరణ పనులు



వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడకు వచ్చే రాజన్న భక్తులు, ఇతర ప్రజలను అబ్బుర పరిచేలా కూడళ్లను సుందరీ కరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కూడళ్ల సుందరీకర ణతో పాటు మూలవాగులో వంతెన పడమర వైపు సుందరీకరణ పనులు చేపట్టారు. ఇందులో రూ.87 లక్షలతో నిర్మించిన నందికమాన్ వద్ద, రూ.46 లక్షలతో శాత్రాజుపల్లి కూడలి వద్ద సుందరీకరణ పనులు పూర్తి కాగా మూలవాగు వంతెన వద్ద మూలవాగులో రూ. 64 లక్షలతో చేపట్టిన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇవన్నీ మహా శివరాత్రిలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ మహా శివరాత్రి గడిచిపోయినా పనులు పూర్తి కాలేదు.వేములవాడ పట్టణానికి వచ్చే భక్తులను ఆకట్టుకునేలా కూడళ్లను తీర్చిదిద్దాలని ప్రణాళికలు సిద్ధం చేసి అయిదు నెలల క్రితం పట్టణంలో సుందరీకరణ పనులు చేపట్టారు. పట్టణానికి రోజూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వారిని ఆకర్షించే విధంగా ఈ కూడళ్లను తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. ఇందులో కూడళ్ల సుందరీకరణ పనులు పూర్తి కాగా మూలవాగులోని పనులు మాత్రం పూర్తి కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. మూలవాగు వంతెన ఇరువైపులా చేపడుతున్న పనులు మొదటి నుంచి నత్తనడకన కొనసాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక పనుల్లో జాప్యం జరుగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పనుల్లో వేగం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.వేములవాడకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రహదారుల కూడళ్లను వచ్చిపోయే వారికి ఎంతో ఆకర్షణగా ఉండే విధంగా తీర్చిదిద్దాలని రూపకల్పన చేశారు. వేములవాడ మూలవాగులోని వంతెన పడమర వైపు ఇరువైపులా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో మట్టి కట్ట, రాయితెట్టు నిర్మాణ పనులు పూర్తి చేశారు. వంతెన మొదలు నుంచి బస్టాండ్ వెనుక వైపు 210 మీటర్లు, వంతెన చివర నుంచి వైకుంఠధామం వైపు 330 మీటర్ల పొడవు బండ్‌ను నాలుగు మీటర్ల వెడల్పుతో నిర్మించి బండ్ పొడవునా వాకింగ్ ట్రాక్, బెంచీలు, గ్రాస్, చెట్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో బండ్ నిర్మాణంతో పాటు రాయితెట్టు నిర్మాణ పనులు మాత్రమే ఉండటంతో మిగతా విద్యుత్తు దీపాల ఏర్పాటు, గ్రీనరీ తదితర పనులను మున్సిపల్ అధికారులు చేపట్టాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితే పట్టణ ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని పంచనుంది. ఉదయం, సాయంత్రం వేళ మూలవాగు ఒడ్డున సేద తీరడానికి ఉపయోగ పడనుంది. ఇదే క్రమంలో మూలవాగులో మురుగును తొలగించాల్సిన అవసరం ఉ ందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నెలాఖరు నాటికి పూర్తి- నవీన్, ఏఈ, నీటిపారుదలశాఖ, వేములవాడ

పట్టణంలోని మూలవాగుపై బండ్ సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఉత్తరం వైపు బండ్ నిర్మాణం పూర్తి చేసి మున్సిపల్‌కు అప్పగించాం. బస్టాండ్ వైపు కొంత పని చేయాల్సి ఉంది. ఇరువైపులా సుందరీకరణ పనులను మున్సిపల్ అధికారులు చేయాల్సి ఉంది. ఈ నెలాఖరు నాటికి పూర్తి కావాల్సి ఉంది.

# ఉపాధి కూలీలకు భద్రత కరవు

సారంగాపూర్ : గ్రామాల్లో వలసల నివారణతోపాటు ప్రతి కూలీకి పని కల్పించాలన్న ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏటా ఒక్కో గ్రామంలో రూ.లక్షల్లో చెల్లింపులు జరుగుతున్నా.. కూలీల భద్రతపై అధికారులు చేతులెత్తేయడంతో అవస్థలు పడాల్సి వస్తుంది. ఉమ్మడి జిల్లాలో 5,01,496 కుటుంబాలలో 9,37,204 మంది కూలీలు ఉన్నారు. ఎండలకు సేద తీరేందుకు పనుల వద్ద నీడ వసతి కల్పించాల్సి ఉండగా ఎక్కడా కనపడడంలేదు. పనులకు వెళ్లే కూలీలకు సామగ్రి అందించడం ఏళ్లుగా ప్రభుత్వం మరిచిపోయింది. తాగునీటి, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచడమే కాకుండా రవాణా వసతి కల్పించాల్సి ఉన్నప్పటికీ డబ్బులు చెల్లిస్తుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీలకు నీడ వసతితోపాటు అన్ని రకాలుగా భద్రత



కల్పించాలి. కొన్నేళ్లుగా సామగ్రి పంపిణీ చేయకపోగా కూలీలకు నీడ వసతి కోసం గ్రామానికి రెండు, మూడు కవర్లు అందించేవారు. వాటిని కూడా నిలిపివేయడంతో చెట్ల నీడకు సేద తీరాల్సిన పరిస్థితి. గతంలో ఉపాధి హామీ పథకం కూలీలకు వచ్చే వారికి గడ్డపార(గునపం), పారలను అందించగా 2014 నుంచి వాటిని అందించడంలేదు. పరికరాలు అందించకపోవడం పట్ల కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు గానూ తట్ట, గడ్డపారకు గాను రూ.6 కూలీలోనే చెల్లిస్తున్నారు. అంతేకాకుండా తాగునీటి వసతి కల్పించాల్సి ఉండగా తాగునీరు అందుబాటులో ఉంచకుండా రూ.5 చెల్లిస్తున్నారు. పనుల వద్ద మెడికల్ కిట్ ఉంచాల్సి ఉండగా సరఫరా లేకపోవడంతో అందుబాటులో ఉన్న ఆశా కార్యకర్తల వద్ద నుంచి తీసుకోవాల్సి వస్తోంది. ప్రమాదాలకు గురైన కూలీలకు ప్రభుత్వం పరిహారం అందిస్తుండగా వాటిపై అవగాహన లేకపోవడంతో సరిగా అందడంలేదు.

కొత్తపంచాయతీలకు క్షేత్ర సహాయకులేరి?

ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడంతో నూతనంగా ఏర్పాటైన వాటికి క్షేత్ర సహాయకుల నియామకాలు చేపట్టకపోవడంతో పాత వారితోనే సర్దుకు పోవాల్సి వస్తోంది. ఇప్పటికే ఉన్న ఆయా గ్రామాల్లో పూర్తిస్థాయిలో లేకపోగా నూతన పంచాయతీలకు మరింత ఇబ్బందిగా మారింది. జగిత్యాల జిల్లాలో 380 పంచాయతీలకు గానూ ప్రస్తుతం 242 మంది మాత్రమే క్షేత్ర సహాయకులు కొనసాగుతున్నారు. పంచాయతీలు విడిపోవడంతో పనులు కల్పించడం, వేర్వేరు ప్రాంతాల్లో కూలీలు పనులకు వెళ్లడంతో హాజరు నమోదు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియామకాలు చేపట్టాలి..-రమేష్, క్షేత్ర సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడుగతంలో పనిచేసిన వారినే తిరిగి కొనసాగిస్తుండడంతో నూతనంగా ఏర్పాటైన పంచాయతీలలో క్షేత్ర సహాయకులు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. గతంలో ఒకేచోట పనులు కొనసాగుతుండగా, ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో కూలీలు పనులకు వెళ్లడంతో హాజరు ఇబ్బందిగా మారింది. గతం కొన్నేళ్లుగా సామగ్రి అందించకపోవడంతో కూలీలే సొంతగా కొనుగోలు చేసుకుని తీసుకువస్తున్నారు. కూలీలకు భద్రత, క్షేత్ర సహాయకుల నియామకాలు చేపట్టాలి.

ప్రస్తుతం 44,211 మంది ఉద్యోగులు పని చేస్తుండగా వీరిలో మహిళలు 1296 మంది.. ఎక్కువగా కార్పొరేట్‌లో 278 మంది, మందమర్రి ఏరియాలో 229 మంది, ఆర్జీ-1లో 222 మంది పని చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన అనేక మంది మహిళలు తమ కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కారుణ్య నియామకాల ద్వారా బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరుతున్నారు. బీటెక్, ఎంటెక్ లాంటి వృత్తి విద్యా కోర్సులతో పాటు, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం లాంటి పీజీ డిగ్రీలు చదివిన వారు, గ్రాడ్యుయేట్లు సైతం ఉన్నారు. ఏ బాధ్యత అప్పగించినా ఆత్మస్థైర్యంతో పని చేస్తున్నారు. జీఎం కార్యాలయాలు, ఏరియా వర్క్‌షాపు, ఏరియా స్టోర్స్, ఏజెంట్ కార్యాయాలు, ఇంటర్నల్ ఆడిట్ ఇలా.. ఎక్కడ చూసినా అన్నింటిలో మహిళా మణులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారు.

## శిక్షణ... భవితకు రక్షణ

గరిడేపల్లి : మహిళలు ఒంటింటికే పరిమితం కాకుండా కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ ఆర్థిక స్వావలంబనలో తమవంతు బాధ్యత వహించా లనుకుంటున్నారు. ప్రస్తుత తరుణంలో భర్తతోపాటు భార్య కూడా ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే కుటుంబ మనుగడ సాధ్యమవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ అందిస్తూ ఉపాధి కల్పిస్తున్న ఎస్‌ఆర్టీఆర్ఐ అందుకు వేదికగా మారింది. మండల పరిధిలోని జలాల్‌పురం గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో బ్యుటీషియన్ కోర్సులో శిక్షణ అందిస్తూ మహిళలలో ఆర్థిక భరోసా నింపుతుంది.

కోర్సులో నేర్పించే అంశాలు..పదో తరగతి విద్యార్హతతో రూ.వెయ్యి నామమాత్రపు రుసుముతో నెల రోజుల పాటు శిక్షణతోపాటు వసతి అందిస్తున్నారు. శిక్షణలో త్రెడ్డింగ్, బ్లీచింగ్, ఫెషియల్, వాక్సింగ్, మెనిక్యూర్, పెడిక్యూర్, మెహందీ, హెయిర్ కట్టింగ్, మేకప్, చీరకట్టు, డ్రెస్సింగ్ తదితర అంశాలపై శిక్షణ అందిస్తారు.

గ్రామీణ మహిళలకు వరం లాంటిది:- సునితాశెట్టి, అనాజ్‌పురం

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ అందంపై ఆసక్తి కనబరుస్తున్నారు. నేను పదో తరగతి పూర్తి చేశాను. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మా లాంటి మహిళలకు ఉపాధి అవకాశాలు మెండుగా ఇలాంటి కోర్సును తక్కువ కాలవ్యవధితో, నామమాత్రపు రుసుముతో శిక్షణ అందించడం ఎంతో ఆనందంగా ఉంది. మంచిగా శిక్షణ అందిస్తున్నారు. స్వయం ఉపాధి సాధించగలననే నమ్మకం ఏర్పడింది.ఉపాధి భరోసా కల్పించే కోర్సు:- వాణి, భూదాన్‌పోచంపల్లి

నేను డిగ్రీ పూర్తి చేశాను. స్వయం ఉపాధి సాధించాలని ఆలోచన చేస్తున్న క్రమంలో సంస్థలో బ్యుటీషియన్ కోర్సులో శిక్షణ అందిస్తున్నారని తెలిసి ప్రవేశం పొందాను. చాలా బాగా శిక్షణ అందిస్తున్నారు. ఆర్థిక భరోసా కల్పించే కోర్సు. శిక్షణ అనంతరం సొంతంగా బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసుకోగలననే నమ్మకం కలిగింది.ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా..:- విజయలక్ష్మి, శిక్షకురాలు

మహిళలు ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా ఉపాధి సాధించాలనే ఉద్దేశ్యంతో అందిస్తున్న బ్యూటీషియన్ కోర్సుపై మహిళలు ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు. ప్రస్తుతం తరుణంలో మంచి డిమాండ్ ఉన్న కోర్సు. శిక్షణ అనంతరం ఖచ్చితమైన ఉపాధి లభిస్తుంది.

# కాగిత రహిత దస్త్రాలతో భద్రత: కలెక్టర్

ఖమ్మం : కురవి నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో సాగు భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.కోటి నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ కలెక్టర్ గౌతమ్‌కు బాధిత రైతులు, వామపక్ష రైతుసంఘాల ప్రతినిధులు నున్నా నాగేశ్వరరావు, దొండపాటి రమేశ్ ఖమ్మంలో సోమవారం వినతిపత్రం అందించారు.

జనాలను సమీకరించాలి

హైదరాబాద్‌లో ఈనెల 14న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి నియోజకవర్గం నుంచి 300 మందిని సమీకరించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజధానికి జనాన్ని తరలించేందుకు బస్సులు, వారికి భోజనం, అల్పాహారం ఏర్పాట్లు చూడాలన్నారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ కలెక్టర్ రాధిక గుప్తా, జడ్పీ సీఈవో అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ, ఆర్డీవ కిషన్ పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని అన్ని రకాల ఫైళ్లు ఈ-ఆఫీస్‌లోనే చేపట్టాలని, భౌతికంగా నిర్వహిస్తే అంగీకరించేది లేదని కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాగిత రహిత ఫైళ్లతో భద్రత ఉంటుందని, ట్యాంపరింగ్‌కు అవకాశం లేదన్నారు. పాత దస్త్రాలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐడీవోస్‌లోకి తరలిన కార్యా



లయాలు పాత భవనాల్లో సామగ్రి పూర్తిగా ఖాళీ చేయాలని, ఆ భవనాలు కేటాయించిన శాఖలకు అప్పగించాలన్నారు. జీవో నెం.58, 59పై ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తులు సేకరించాలన్నారు. గ్రామాల్లో దొంకలు, పంట పొలాలకు రహదారులపై నివేదిక సమర్పించాలన్నారు. మండలాలకు సంబంధించిన దస్త్రాలు ఎవరివి వారికి అప్పగించాలన్నారు. మామిడి పండ్లు కార్బైడ్ ద్వారా మగ్గబెట్టే అవకాశం ఉన్నందున నిరంతర తనిఖీలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ స్నేహలత, శిక్షణ కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్వో శిరీష, ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలపై సమీక్ష

అకాల వర్షాలకు జరిగిన పంట నష్టంపై సర్వే వివరాలతో కూడిన నివేదికలో సవరణలు త్వరగా పూర్తి చేయాలని, నష్టపోయిన ప్రతి రైతు వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఏవో విజయనిర్మల, ఉద్యాన అధికారి అనసూయ, ఏడీఏలు, ఏవోలు పాల్గొన్నారు.

# అసంపూర్తి పనులు.. ప్రజల అవస్థలు

వరంగల్ : కొడకండ్ల – అవుతాపురం గ్రామాల మధ్య రెండేళ్ల క్రితం ప్రారంభించిన రెండు వరుసల రహదారి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రోడ్డుపై వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. కొడకండ్ల నుంచి వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారికి అనుసంధానమయ్యేలా పెద్దవంగర మండలంలోని అవుతాపురం వరకు రూ.8.7 కోట్లతో 2021–22 సంవత్సరంలో 11 కి.మి. పొడవైన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ముందుగా రోడ్డు విస్తరణ, కంకర పనులు ప్రారంభించిన గుత్తేదారు.. రంగాపురం, గంట్లకుంట, అవుతాపురం గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. అవుతాపురం సమీపంలో ఉన్న లోలెవల్ కల్వర్టును పైపులు వేసి ఎత్తుగా నిర్మించే సమయంలో వరద ఉధ్రుతికి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో పనులు నిలిచిపోయాయి. నేటికీ పనులను తిరిగి ప్రారంభించకపోవడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పెద్ద గుంతలు పడి కంకర తేలడంతో తిరగలేకపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కొడకండ్లతో పాటు సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు వరంగల్‌కు వచ్చేందుకు దూరం తగ్గుతుంది. అవుతాపురం నుంచి వరంగల్ –ఖమ్మం జాతీయ రహదారి వరకు, పాలకుర్తి–నాంచారిమడూరు రెండు వరుసల రోడ్డు నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర గడిచింది. కొడకండ్ల – అవుతాపురం



రహదారి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పూర్తి కాని వంతెన నిర్మాణం

రహదారి నిర్మాణంలో భాగంగానే అదే సంవత్సరంలో రూ.3.95 కోట్లతో కొడకండ్ల సమీపంలో ఉన్న బయ్యన్నవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రారంభంలో పనులు వేగంగా జరిగినప్పటికీ స్తంభాలు నిర్మించిన తర్వాత ఆర్నెల్ల నుంచి పనులు నిలిచిపోయాయి. వంతెన పైకప్పు, ఇరు వైపులా రోడ్డును అనుసంధానం చేయాల్సిన పనులు మిగిలాయి. గతంలో నర్సింగాపురం, గంట్లకుంట, రంగాపురం గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు ఈ వంతెన వద్ద ఉన్న కల్వర్టు ద్వారా కొడకండ్లకు రాకపోకలు సాగించే వారు. ప్రస్తుతం మూడు కి.మీ.దూరం తిరిగి వెళ్తున్నారు. అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణంపై అధికారులను ప్రశ్నించగా.. పనులు చేపట్టిన గుత్తేదారు అకస్మాత్తుగా మరణించడంతో పనులు నిలిచిపోయాయన్నారు. మరో గుత్తేదారుతో పనులను పూర్తి చేయిస్తామన్నారు. వెంటనే రోడ్డు, వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పక్షం రోజుల్లో ప్రారంభిస్తాం–సురేష్, పంచాయతీరాజ్ శాఖాధికారి

ఆరు మాసాలుగా నిలిచిపోయిన రోడ్డు, వంతెన పనులను పక్షం రోజుల్లో ప్రారంభించి పూర్తి చేస్తాం. ఇటీవల వరంగల్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో.. కొడకండ్ల – అవుతాపురం రోడ్డు, బయ్యన్నవాగు వంతెన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు నిర్ణయించారు. పనులు ప్రారంభించి రెండు మాసాల్లో పూర్తి చేస్తాం.

# అమ్మ కడుపు చల్లగా..



ఖమ్మం : భద్రాద్రి జిల్లాలో ఏజెన్సీ మండలానికి చెందిన ఓ బాలికకు పెద్దలు ప్రేమ వివాహం జరిపించారు. పదహారేళ్లకే ఆమె గర్భం దాల్చింది. కానీ బిడ్డ ఎదుగుదల సవ్యంగా జరగలేదు. మరోవైపు తల్లి ప్రాణానికీ ముప్పు తలెత్తింది. దీంతో గర్భ విచ్ఛిత్తి చేసి వైద్యులు ప్రాణం కాపాడారు. చింతకాని మండలానికి చెందిన ఓ యువతి హైరిస్క్ ప్రెగ్నెన్సీ దాల్చారు. ఐదో నెలలో తీవ్ర రక్తస్రావమైంది. గర్భస్థ శిశువు చనిపోయింది. ఖమ్మంలోని సర్వజన ఆస్పత్రిలో గర్భిణిని చేర్పించి చికిత్స అందించారు. యువతి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మార్చి 31న ఆమె మృతిచెందారు. రక్తం గడ్డకట్టే స్వభావం కారణంగా ప్రాణహాని కలిగినట్లు వైద్య నిపుణులు తెలిపారు.

మాతృత్వం అనేది ప్రతి స్త్రీ కల. ఆ మధుర క్షణాల కోసం భరించని బాధనేది ఉండదంటారు. పుట్టిన బిడ్డ ద్వారా కలిగే స్పర్శతో.. తొమ్మిది నెలల్లో భరించిన బాధంతా దూదిపింజలా ఎగిరిపోతుందనేది ప్రతి అమ్మ మాట. నాణేనికి మరోవైపు చూస్తే కొందరు నవమాసాలు మోసిన బిడ్డను కళ్లారా చూడలేకపోతున్నారు. గర్భంలో శిశువు, కాన్పు సమయాల్లో తల్లి మృత్యువాతపడుతున్న విషాద ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. పలు కారణాలతో తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై గర్భిణులు అశ్రద్ధ చూపుతున్నారు. అలాంటి సందర్భాల్లో వారిలో అవగాహన కల్పించి, అండగా నిలవాల్సిన బాధ్యత కుటుంబసభ్యులు, వైద్యశాఖ, క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉంది. నేడు 'జాతీయ మాతృత్వ రక్షణ దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

గర్భం దాల్చాక కొందరు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. వీరితో పాటు రక్తహీనత, బీపీ, షుగర్, థైరాయిడ్, ఉబ్బసం, హృద్రోగాలతో (హైరిస్క్) బాధపడుతున్నవారు ప్రసవ సమయంలో క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలున్నప్పుడు వైద్యుల పర్యవేక్షణలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే మాతా, శిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. బాల్య వివాహాలు మరో ప్రధాన కారణంగా నిలుస్తోంది. కడుపులో బిడ్డ అడ్డం తిరిగి ఉమ్మనీరు ఎక్కువ మోతాదులో కోల్పోవడమూ ఇటీవల కాలంలో సమస్యగా మారుతోంది. రక్తహీనత సమస్యతో పురిట్లోనే శిశువును కోల్పోతున్నవారున్నారు. గర్భిణులు స్వీయ జాగ్రత్తలు పాటిస్తూ వైద్యుల సలహాలు ఆలకిస్తే ఈ గండం నుంచి గట్టెక్కడం సులభం.

ఆరోగ్య సంరక్షణే ప్రధానం..

డాక్టర్ దివ్య, డీజీవో (జిల్లా సర్వజన ఆస్పత్రి)

స్త్రీ తల్లి అయ్యే తరుణంలో సంపూర్ణ శక్తిమంతురాలు కావాలి. పురిటి వేదన భరించాలంటే కొత్త శక్తి కూడగట్టుకోవాలి.

గర్భ నిర్ధారణ జరగగానే ఆశా కార్యకర్త, ఏఎన్ఎంలను సంప్రదించి ఎంసీపీ(మదర్ ఛైల్డ్ ప్రొటెక్షన్) కార్డు తీసుకోవాలి.

మూడో నెలలో వైద్యుల సలహాతో రక్తపరీక్షలు చేయించాలి. ధనుర్వాతం రాకుండా టీటీ(టెటానస్ టెక్సాయిడ్) ఇంజెక్షన్ తీసుకోవాలి.

4 నుంచి 7 నెలల మధ్య ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి.

పిండంలో అవయవ లోపాలుంటే గుర్తించేందుకు ఐదోనెలలో టిఫా స్కానింగ్ చేయించాలి.

శిశువు ఎదుగుదలకు సంబంధించి 10 నుంచి 13 వారాల సమయంలో, 8వ నెలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయించాలి.

తొమ్మిదో నెలలో రెండుసార్లు, ఆ తర్వాత కాన్పు జరిగే వరకు వారానికోసారి వైద్యులను సంప్రదించాలి.

జీవనశైలి, వయస్సు, దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా తలెత్తే సమస్యలను అధిక ప్రమాద గర్భధారణ (హైరిస్క్)గా పరిగణిస్తాం. ఇలాంటి కేసుల్లో తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభావం ఉంటుంది.

రక్తహీనత, బీపీ, అధిక బరువు, మధుమేహం, హెచ్ఐవీ పాజిటివ్, ప్రీ ఎక్లంప్రిసియా, న్యూరల్ ట్యూబ్ లోపం, ఒకటి కంటే ఎక్కువ పిండాలున్నట్లయితే తగిన చికిత్స పొందాలి. మానసిక ఒత్తిడి లేకుండా జాగ్రత్తపడాలి.

ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూసుకోవాలి.

# లబ్ధిదారుల్లో ఆశల చిగురింత..!



అశ్వారావుపేట : చాలాకాలంగా వాయిదా పడుతూ వస్తున్న రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ అంశంపై టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలు చేయగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మూడు రోజుల కిందట వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. రెండో విడత పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. గొర్రెల యూనిట్ల సేకరణ, రవాణా, లబ్ధిదారుల నుంచి డిపాజిట్ల వసూలు ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలని సూచించారు. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పటిష్ఠ చర్యలు..!

రెండో విడతతో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. ఎంపికచేసిన వారి ఇళ్లకు వెళ్లి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఒకవేళ లబ్ధిదారులు చనిపోతే నామినీగా భార్య లేదా కుమారులను ఎంపిక చేసి పంపిణీ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. పారదర్శకత కోసం ఈసారి జీపీఎస్ సౌకర్యమున్న వాహనాల్లోనే జీవాలను రవాణా చేయనున్నారు.

జిల్లాలో పంపిణీ ఇలా..

తెలంగాణ ప్రభుత్వం 2017లో చేపట్టిన ఈ పథకానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 11,050 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, తొలి విడతలో దశలవారీగా 7,511 మందికి గొర్రెలు అందజేశారు. ఒక్కో యూనిట్‌కు 21 జీవాల (1పొట్టేలు, 20గొర్రెలు) చొప్పున మొత్తం 1,57,731 గొర్రెలు అందజేశారు. రెండో విడత కోసం 3,539 మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వీరిలో 1,412 మంది తమ వాటాగా చెల్లించాల్సిన డిపాజిట్లకు ఆన్‌లైన్ పేమెంట్ ప్రక్రియ పూర్తి చేశారు. మిగిలిన వారు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వీరందరికీ త్వరలో జీవాలు అందనున్నాయి. మొదటి విడత సమయంలో గొర్రెల యూనిట్ విలువ రూ.1.25లక్షలు ఉండేది. లబ్ధిదారుల వాటా రూ.31,250 కాగా, మిగతా సొమ్మును ప్రభుత్వమే భరించేది. ప్రస్తుతం జీవాల ధరలు పెరగడంతో ప్రభుత్వం యూనిట్ విలువను రూ.1.75 లక్షలకు పెంచింది. లబ్ధిదారుల వాటా రూ.43,750కి చేరింది. ఈమేరకు రెండో విడత లబ్ధిదారులపై రూ.12,500 అదనపు భారం పడుతోంది. అలాగే ప్రభుత్వంపైనా అదనపు భారం పడుతుంది. ఈ నెలాఖరుకల్లా గొర్రెల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి కార్యాచరణ మొదలైంది. లబ్ధిదారుల జాబితాతోపాటు, పూర్తి వివరాలను ఈల్యాబ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. జిల్లాలో ఇంకా 2,137 మంది డిపాజిట్ ఆన్‌లైన్ పేమెంట్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అర్హులు ఆన్‌లైన్ చెల్లింపుల వివరాల కోసం ఆయా మండలాల్లోని పశు వైద్యాధికారులను సంప్రదించి, త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంపిణీ ప్రక్రియ చేపడతాం. బి.పురందర్, జిల్లా పశువైద్యాధికారి

# గనుల్లో నారీ'మణులు'

భూపాలపల్లి : సింగరేణి అభివృద్ధిలో మహిళలు తమ వంతు పాత్రను పోషిస్తున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ప్రాణాలను తెగించి నిర్వహించే విధులకు మేము సైతం అంటున్నారు. పురుషులకు దీటుగా కంపెనీలో సత్తా చాటేందుకు వనితలు ముందుకొస్తున్నారు. కారుణ్య నియామకాల ద్వారా కొందరైతే.. రాత పరీక్షల ద్వారా మరికొందరు కొలువుల్లో చేరుతున్నారు. గతంలో భూగర్భంలో బొగ్గు వెలికితీత అంటే వణికిపోయే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం యాంత్రీకరణ, పటిష్ఠమైన రక్షణ చర్యలతో బావులు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. దీంతో సింగరేణిలో కొలువు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. రెండు మూడు ఏళ్లుగా మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. మూడేళ్లలో సింగరేణి వ్యాప్తంగా 5632 కారుణ్య నియామకాలు జరిగాయి. అందులో 542 మందికి పైగా యువతులు బదిలీ వర్కర్లుగా కొలువు సాధించారు. ఉద్యోగం చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు. ప్రస్తుతం 44,211 మంది ఉద్యోగులు పని చేస్తుండగా వీరిలో మహిళలు 1296 మంది.. ఎక్కువగా కార్పొరేట్‌లో 278 మంది, మందమర్రి ఏరియాలో 229 మంది, ఆర్జీ–1లో 222 మంది పని చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన అనేక మంది మహిళలు తమ కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కారుణ్య నియామకాల ద్వారా బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరుతున్నారు. బీటెక్, ఎంటెక్ లాంటి వృత్తి విద్యా కోర్సులతో పాటు, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం లాంటి పీజీ డిగ్రీలు చదివిన వారు, గ్రాడ్యుయేట్లు సైతం ఉన్నారు. ఏ బాధ్యత అప్పగించినా ఆత్మస్థైర్యంతో పని చేస్తున్నారు. జీఎం కార్యాలయాలు, ఏరియా వర్క్‌షాపు, ఏరియా స్టోర్స్, ఏజెంట్ కార్యాయాలు, ఇంటర్నల్ ఆడిట్ ఇలా.. ఎక్కడ చూసినా అన్నింటిలో మహిళా మణులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారు.

# పాతాళానికి జలం

భూపాలపల్లి : జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఎండల తీవ్రత, నీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో రోజురోజుకు భూగర్భ జలం లోతుకు వెళ్తోంది. అవసరానికి మించి నీటి వినియోగంతో పాటు నీటి వృథా, నీటి వసతి ఎక్కువగా అవసరమయ్యే పంటలను సాగు చేస్తుండటంతో భూగర్భ జలాలు పాతాళంలోకి వెళ్తున్నాయి. నీటి పొదుపు చర్యలు చేపట్టాలని, వినియోగంలో మెలకువలు పాటిస్తూ పొదుపు చర్యలు చేపట్టాలని భూగర్భ జల శాఖ అధికారులు చెబుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల సరాసరి 8.59 మీటర్ల లోతులో ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పాతాళ గంగ 7.98 మీటర్ల లోతులో ఉండగా నెల వ్యవధిలో మార్చి నెల వచ్చే సరికి 8.59 మీటర్ల లోతులోకి వెళ్లిపోయింది. అంటే ఒక నెలలో 0.61 మీటరు లోతుకు పడిపోయింది. ఏప్రిల్, మే, జూన్ వరకు అంటే మరో మూడు నెలల వరకు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉండటంతో జిల్లాలో భూగర్భ జలాలు మరింత లోతుకు వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. నీటిని అవసరానికి మించి వినియోగించడమే కాకుండా వృథాను అరికట్టకపోవడంతో నీటి మట్టాలు తగ్గుతున్నాయని తెలుపుతున్నారు.

మూడు మండలాల్లో అత్యధికం

జిల్లాలోని 11 మండలాల్లో అత్యల్పంగా కాటారం మండలంలో 20.98 మీ., మహదేవ్‌పూర్ మండలంలో 12.97 మీ., పలిమెల మండలంలో 9.39 మీ. లోతులో నీరు ఉండటం ఆందోళన కలిగించే విషయం..



భూగర్భ జలాలు తక్కువగా ఉన్నటువంటి మండలాల్లో ఇప్పటి నుంచే నీటి రక్షణ చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో నీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. మూడు మండలాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నీటి పొదుపు ఎంతో ముఖ్యం

జిల్లాలో భూగర్భ జల రక్షణకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అన్నదాతలు పంటలకు అవసరానికి మించి నీటిని వాడకుండా పొదుపు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా రైతులు తక్కువ నీరు వినియోగమయ్యే ఆరుతడి పంటలను పండించేందుకు మొగ్గు చూపాలి. పంటలకు నీరు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం విద్యుత్తు సరఫరా చేస్తున్నందున ఇష్టానుసారంగా బోర్ల నుంచి నీటిని తోడేస్తున్నారు. అలా కాకుండా పంటకు సరిపోను నీటిని వాడుకునేలా అన్నదాతల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ఆరుతడి పంటలతో పంట మార్పిడి జరిగి భూమి కూడా సారవంతమయ్యే అవకాశాలు లేకపోలేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

అవసరానికి మించి వినియోగించకూడదు– శ్రీనివాసరావు, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి

జిల్లాలో ప్రతి నెలా భూగర్భ జలాల నిల్వలను అంచనా వేస్తుంటాం. ప్రస్తుతం జిల్లాలో భూగర్భ జలాలు 8.59 మీటర్ల లోతులో ఉన్నాయి. ప్రతి ఒక్కరూ నీటిని అధికంగా వాడకుండా పొదుపుగా వాడుకోవాలి. భూగర్భ జలాలను ఎక్కువగా వాడటంతో ఇంకిపోతున్నాయి. పాంపాండ్స్, చెక్‌డ్యాంలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలి. అలాగే ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతను నిర్మించుకోవాలి. జల రక్షణ చర్యలు చేపట్టడంతో భూగర్భ జలాలు తగ్గకుండా ఉంటాయి.

# తీగల వంతెనకు తుది మెరుగులు

కరీంనగర్ : తీగల వంతెన పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. మిగిలినవి పూర్తి చేసేందుకు వేగం పెంచారు. అప్రోచ్ రోడ్‌తోపాటు డైనమిక్ లైటింగ్ సిస్టం పనులు జరుగుతున్నాయి. రోడ్లు, భవనాల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

మిగిలిన పనులు ఇలా...సదాశివపల్లి నుంచి వంతెన వరకు రాజీవ్ రహదారి హైవే నుంచి వంతెన వరకు అప్రోచ్ రోడ్ పనులు తుది దశలో ఉన్నాయి. తారు వేసి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాల్సి ఉంది. వంతెన మధ్యలో ఆరు మీటర్ల స్లాబ్ మిగిలి ఉంది. అక్కడ స్టీల్ అల్లకం చేస్తున్నారు. రోడ్డు ప్లాట్‌ఫాం పనుల్లో వేగం పెంచారు.రెండు పెద్ద తెరల ఏర్పాటుతోపాటు లైటింగ్‌కు సంబంధించిన పనులు కూడా జరుగుతున్నాయి. రెండు వైపులా వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారు.

అయిదేళ్ల కిందట పనులు ప్రారంభం..

ఇతర జిల్లాల నుంచి కరీంనగర్ మీదుగా వరంగల్‌కు వెళ్లేందుకు ట్రాఫిక్ రద్దీ సమస్యను అధిగమించడానికి, దూరాన్ని తగ్గించేందుకు వీలుగా రాజీవ్ రహదారి సమీపంలో ఉన్న మానేరుపై తీగల వంతెన నిర్మాణానికి కార్యాచరణ రూపొందించారు. 2018 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. మొత్తం రూ.183 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులు భూసేకరణలాంటివి పెరిగాక రూ.243 కోట్లకు చేరుకుంది. కమాన్ నుంచి సదాశివపల్లి వరకు అప్రోచ్ రోడ్‌తో కలిపి 4–7 కిలోమీటర్ల రహదారి వంతెన నిర్మాణంతో పనులు జరుగుతున్నాయి.

14లోగా పనులు పూర్తి చేయండికరీంనగర్ పర్యాటక శోభను పెంచుతూ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న తీగల వంతెన నిర్మాణ పనులు ఈనెల 14లోగా పూర్తి చేయాలని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు.నగర మేయర్ సునీల్‌రావు, జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, పోలీసు కమిషనర్ సుబ్బారాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బ్రిడ్జి నుంచి సదాశివపల్లి వరకు రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన చేసేలా పర్యవేక్షణ పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ సాంబశివరావు, అధికారులు, కార్పొరేటర్లు ఉన్నారు.

# ఆసిఫాబాద్ జిల్లాలో పొంచి ఉన్న నకిలీ విత్తనాల ముప్పు

నిర్మల్ : నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా అక్రమార్కులు కొత్తదారులు వెతుక్కుంటున్నారు. విత్తనాలు విత్తుకునే సమయంలో తనిఖీలు ఎక్కువగా ఉంటాయనుకుంటున్న వ్యాపారులు ఏటా వేసవిలోనే దందా మొదలు పెట్టి రైతులకు అంటగట్టేస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేక నిఘాను పెంచాల్సిన అవసరం ఉందని రైతుసంఘాలు డిమాండ్ చేస్తు న్నాయి. బీటీ-3 పేరిట సాగవుతున్న ఈ నకిలీ-మకిలీలో స్థానిక వ్యాపారులతో పాటు కొంతమంది బడాబాబులు కూడా కీలకపాత్ర పోషిస్తున్నారన్న ఆరోప ణలున్నాయి. ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ విత్తనాలను గ్రామాల్లో రైతులకు ప్రతీ ఏటా ఏజెంట్ల ద్వారా అంటగడుతున్నారు. రెండు మూడేళ్ల నుంచి చాలా మంది రైతులు బ్లాక్‌మార్కెట్లో ఈ విత్తనాలతో పాటు ఆ కంపెనీకే చెందిన గడ్డి మందును కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయారు. వేలాది ఎకరాల్లో ఈ మందు పిచికారి చేయడంతో పత్తి మొక్కలు చనిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టం చవిచూశారు. గతేడాది ఇదే ఎండాకాలం జిల్లా సరిహద్దు ప్రాంతమైన గూడెం గ్రామంలో రైతులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన గ్లైసిల్ పత్తివిత్తనాలు 42లక్షల విలువ గల 21క్వింటాళ్ల నకిలీ పత్తివిత్తనాలతో పాటు, ఓ కారును స్వాధీనం చేసుకొని దీనికి సంబంధం ఉన్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. అప్పట్లో ఈ సంఘటన కలకలం రేకెత్తించింది. పట్టుబడిన ఈ ముఠా గుంటూరు జిల్లా నూజివీడు పరిసర ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తిం చారు. దాంతో ఇక్కడి వ్యవసాయ అధికారులు, పోలీసులు అనుమానిత ప్రాంతాల్లో జల్లెడ పట్టగా, పెద్దఎత్తున బీటీ-3 పేరిట విక్రయాలు జరుపు తున్న నకిలీ గ్లైసిల్ విత్తనాలను పట్టుకున్నారు. ఈ వ్యవహారంపై వ్యవసాయ అధికారులు రైతాంగాన్ని ఎంత చైతన్య పరుస్తున్నా అధిక దిగుబడిపై ఆశ, కలుపు నివారిస్తుందన్న నమ్మకం, పెట్టుబడి పెద్దగా ఉండదన్న అభిప్రా యాల కారణంగా చిన్న, సన్నకారు రైతులు ఈ విత్తనాల పట్ల వేలం వెర్రిగా ఎగబడుతున్నారు. సరిగ్గా ఈ అంశమే అక్రమార్కుల పంట పండిస్తోంది. ఏటా భారీగా అక్రమ దందానకిలీ నిత్తనాలతో పట్టుబడిన అక్రమ వ్యాపారులను అధికారులు విచారిస్తున్నప్పుడు గ్రామాల్లోని దళారులు, వ్యాపారుల ద్వారా రైతులకు నేరుగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దందా భారీ ఎత్తున సాగుతున్నట్లు వెల్లడ వుతోంది. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ విస్తీర్ణంలో పత్తి పంటను సాగుచేస్తు న్నారు. జిల్లాలోని మారుమూల మండలాలైన చింతలమానేపల్లి, కౌటాల, బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట, సిర్పూర్(టీ) మండలాల్లోని దాదాపు అన్ని గ్రామాల్లో విత్తనాలను రైతులకు అంటగడుతూ రైతాంగాన్ని తీవ్ర నష్ట పరుస్తున్నారు. నకిలీ పత్తి విత్తన ప్యాకెట్ 450గ్రాములు రూ.1000నుంచి 1500 వరకు విక్రయించగా, కిలో విత్తనాలు రూ. 2500నుంచి 3000 వరకు విక్రయించారు. నకిలీ విత్తనాలతో నష్టాలే ఎక్కువ..గ్లైసిల్ విత్తనాలను రైతులు తమ తమ చేన్లల్లో వరుసగా 7సంవత్సరాలు సాగు చేస్తే మరుసటి సంవత్సరం నుంచి కనీసం మొలక కూడా మొలవక పోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దళారుల వద్ద కొన్న నకిలీ విత్తనాలకు ఎలాంటి రశీదులు ఇవ్వరు కాబట్టి పంటనష్టపోతే రైతులకు ఎలాంటి ప్రభుత్వసాయం అందదని అధికారులు హెచ్చరిస్తున్నారు. వీటి కారణంగా రైతుల భూముల భూసారం తగ్గిపోవడం, పర్యావరణ ముప్పు పొంచి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. కఠిన చర్యలు కరువు..నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న క్రమంలో పట్టుబడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ దందా ఏటా జోరుగా సాగుతోంది. నకిలీ విత్తనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపడం రిపోర్ట్‌లు ఐదారు నెలల తర్వాత వచ్చే వరకు చార్జిషీట్ తయారు కాకపోవడంతో అక్రమ వ్యాపారులు ప్రతీఏటా ఈ దందానే వృత్తిగా ఎంచుకుంటున్నారు. కఠిన చర్యలు తప్పవు..- రాజేష్, ఏవోనకిలీ విత్తనాలను రైతులు కొనుగోలు చేసి మోసపోవద్దు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన ఎరువులు, విత్తనాల దుకాణాల్లో మాత్రమే విత్తనాలను, మందులను కొనుగోలు చేయాలి. నకిలీ విత్తనాలతో పట్టుబడ్డ వారిపై చట్టారిత్యా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే సమాచారం ఇచ్చి అధికారులకు సహకరించాలి. రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

# విద్యార్థులూ.. పరీక్షలంటే ఆందోళన వద్దు

నిర్మల్ : ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న కొద్ది విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లోనూ ఆందోళన మొదలవుతుంది. తీవ్ర ఒత్తుడుల నేపథ్యంలో ఇంటర్, పదిలో ఉత్తమ ఫలితాలను సాధించటం కోసం దృష్టి కేంద్రీకరించే విద్యార్థులు ఆహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తారు. దీంతో చదువుపై ఆసక్తి తగ్గిపోయి లక్ష్యం నీరుగారిపోయే ప్రమాదముంది. పరీక్షల సమయంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ఒత్తిడికి గురికాకుండా సమయానికి ఆహారం తీసుకుంటూ బాగా నిద్రపోతే జ్ఞాపకశక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. తీసుకోవాల్సిన ఆహారం..- చదివేటప్పుడు ఒత్తిడికి



గురికావడంతో కడుపులో మంట వస్తుంది. పండ్లరసాలు, మజ్జిగతో కూడిన అన్నం తీసుకుంటే బాగుంటుంది. - క్యారెట్‌ను తినటం వల్ల విటమిన్ ఏ లభించి కళ్లకు మేలు చేకూరుతుంది. - ఉదయం ఇండ్లీ తినటం వల్ల విద్యార్థులకు కార్బోహైడ్రేట్స్ లభించి శక్తిని అందిస్తాయి. - జామ, అరటి, యాపిల్ వంటి పండ్లను తీసుకోవటం వల్ల జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేస్తుంది.- విద్యార్థులు ఒత్తిడికి గురికావటంతో చెమటలు పడతాయి. ఇలాంటి విద్యార్థులు నీటిని ఎక్కువగా తీసుకోవాలి. - పరీక్షల సమయంలో కొవ్వు పదార్థాలు, నూనె వస్తువులు, మాంసాహారాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలి. - తీసుకునే ఆహారం పరిమాణం తగ్గించాలి. నిద్రపోయే ముందు పాలు తీసుకోవాలి. - ఒత్తిడిని అధిగమించేందుకు యోగా చేస్తే ఫలితం ఉంటుంది. - ఆహారం, నిద్ర ముఖ్యం డాక్టర్ సతీష్‌విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు. చదివిన అంశాలు గుర్తు ఉండాలంటే నిద్రకు 7-8గంటలు కేటాయించాలి. విద్యార్థులు ఇడ్లీ, పెరుగు అన్నం, అరటిపండు, క్యారెట్, పాలు, నీళ్లు ఎక్కువగా తీసుకుంటే మంచిది. సమయానికి ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలి.

# మైనారిటీ విద్యకు మహర్దశ



నిర్మల్ : జిల్లాలో మైనారిటీ విద్యకు మహర్దశ పట్టబోతోంది. రాష్ట్రప్రభుత్వం మైనారిటీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌కు భారీగా నిధులు కేటాయించడమే కాకుండా కొత్త విద్యాసంస్థల ఏర్పాటుకు నడుం బిగించడం నిర్మల్ ప్రాంతానికి వరంగా మారుతోంది. ముఖ్యంగా మంత్రి అల్లో ల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ము షారఫ్ ఆలీ ఫారూఖీలు నిర్మల్‌ను మైనారిటీలకు ప్రత్యేక ఎడ్యుకేషన్ హబ్‌ను ఏర్పాటు చేయాలని తలపెట్టారు. దీని కోసం గానూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందుకు అనుగుణంగానే స్థానిక చించోలి వద్ద ప్రస్తుతం రూ.50 కోట్లతో చేపట్టిన మైనారిటీ ఎడ్యుకేషన్ క్యాంపస్ భవిష్యత్ తరాలకు ఉన్నత స్థాయి విద్యను అందించబోతోందంటున్నారు. ఇక్కడి చించోలి వద్ద ప్రస్తుతం బాలురు, బాలికలకు అవసరమయ్యే హాస్టల్‌లు, అలాగే హైస్కూల్, ఇంటర్మీడియట్ స్థాయిలో బోధన అందించేందుకు ఏర్పాట్లు మొదలుపెట్టారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ మైనారిటీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ భవన నిర్మాణాలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్న కారణంగా పనులు వేగం గా సాగుతున్నాయంటున్నారు. మొత్తం మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణంతో పాటు హాస్టల్ భవనాన్ని అలాగే మైనార్టీ బాలికల హాస్టల్, బాలికల కాలేజీని నిర్మించనున్నారు. జిల్లాకేంద్రంలో బాలురు, బాలికలకు సంబంధించిన హైస్కూల్‌స్థాయి విద్యతో పాటు కాలేజీ విద్యకోసం కూడా ఏర్పాట్లు చేశారు. నిర్మల్‌లో బాలికలు, భైంసా, ఖానాపూర్, ముథోల్‌లో బాలురు, ముథోల్‌లో బాలికల విద్యాసంస్థను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కలెక్టర్ పలుసార్లు ఇక్కడి మైనారిటీ ఎడ్యుకేషన్ హబ్ ప్రాంగణాన్ని సందర్శించి సంబంధిత యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైతం ఇటీవల మైనారిటీ ఎడ్యుకేషన్ క్యాంపస్‌ను సందర్శించారు. ఏళ్ల నుంచి మైనారిటీలకు సామాజిక పరిస్థితుల కారణంగా ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందన్న వాదనలున్నాయి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచే మైనారిటీ సంక్షేమం, విద్య, మౌలిక సౌకర్యాల కల్పన లాంటి అంశాలకు ప్రాధాన్యత నిచ్చింది. ముఖ్యంగా నిర్మల్ జిల్లా లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలపై ప్రత్యేకదృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఆయన గ తంలో ఎన్నడూ లేని విధంగా ప్ర భుత్వం ద్వారా మైనారిటీ శాఖకు భారీగా నిధులను విడుదల చేయించారు. దీంతో చించోలి వద్ద దాదాపు పది ఎకరాలకు పైగా భూమిని సే కరించి అక్కడి నిర్మాణ పనులను చేపట్టారు. స్పెషల్ క్యాంపస్ నిర్మాణంమైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నతస్థాయి విద్యను ఉచితంగా అందించేందు కోసం ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులను మంజూరు చేయడం ఇక్కడి మైనారిటీ విద్యారంగానికి శుభసూచకమవుతోంది. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలెక్టర్ ముషారఫ్ ఆలీ ఫారూఖీ ప్రత్యేక చొర వ తీసుకొని నిధులు, పనులపై దృష్టి కేంద్రీకరించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఎప్పటికప్పుడు ప్రభుత్వం ద్వారా నిధులను విడుదల చేయించడం, కలెక్టర్ పనుల పర్యవేక్షణ సాగించడంతో ప్రస్తుతం చించోలి వద్ద భారీ మైనారిటీ ఎడ్యుకేషన్ క్యాంపస్ ఆవిర్భవించింది. ఈ క్యాంపస్‌ను మాడ్రన్ ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందు కోసం సంబంధిత అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ క్యాంపస్‌లో బాలురకు, బాలికలకు వేరువేరుగా హాస్టల్ భవనాలను నిర్మిస్తున్నారు. అలాగే బాలురు, బాలికలకు వేరువేరుగా పాఠశాల భవనాలను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త హంగులతోమైనారిటీ విద్యాసంస్థలలో విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలను సమకూరుస్తున్నారు. ముఖ్యంగా టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి ప్రాధాన్యత కల్పించబోతున్నారు. విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాలపై కూడా పట్టు పెంపొందించేందు కోసం టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను అందించనున్నారు. యూనివర్సిటీ తరహాలో ఈ మై నారిటీ ఎడ్యుకేషన్ క్యాంపస్‌ను నిర్మిస్తున్నారు. ఈ విద్యాసంస్థల్లో భోధిం చే టీచర్లకు కూడా వసతిసౌకర్యం కల్పించేందుకు క్వార్టర్‌లను నిర్మిస్తున్నారు. విద్యార్థి ప్రాథమికస్థాయి నుంచి ఉన్నతస్థాయి విద్యను పొందే వరకు వారికి ఇక్కడే ఉచితవసతిని, విద్యాబోధనను అందించనున్నారు. భారీగా నిధులుకాగా మైనారిటీ సంక్షేమానికి భారీగా నిధులు విడుదలవుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇప్పటికే మైనారిటీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ భవన నిర్మాణాలకు ప్రభుత్వం దాదాపు రూ.100 కోట్ల మేరకు నిధులను మంజూరు చేసింది. ఇక్కడి చించోలి వద్ద కనివిని ఎరుగని రీతిలో విద్యాసంస్థల భవనాల నిర్మాణాలు చురుకుగా సాగుతున్నాయి. నిర్మాణ పనులకు ఎప్పటికప్పుడు నిధులు విడుదలవుతున్న కా రణంగా పనుల్లో జాప్యం జరగడం లేదు. చించోలి వద్ద నిర్మిస్తున్న మైనారిటీ ఎడ్యుకేషన్ క్యాంపస్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవబోతోందని సంబందిత అధికారులు వెల్లడిస్తున్నారు. మైనారిటీలకు ఉన్నత స్థాయివిద్యచించోలి వద్ద నిర్మిస్తున్న మైనారిటీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ మైనారిటీలకు వరం కాబోతున్నాయి. బాలికలకు వేరువేరుగా వసతిసౌకర్యం కల్పించి విద్యా బోధనను అందించనున్నాం. ఎక్కడ కూడా నిధుల కొరత లేదు. మైనారిటీలంతా విద్యకు చేరువ కావాలన్నదే ప్రభుత్వలక్ష్యం. విద్యతోనే పేదరికం దూరమై ఆర్థికంగా, సామాజికంగా ముందుకు సాగవచ్చు. - ముషారఫ్ ఆలీ ఫారూఖీ, కలెక్టర్, నిర్మల్ జిల్లా

# పంచాయతీ ఉపపోరుకు సన్నద్ధం

సిరిసిల్ల : స్థానిక ఉప పోరుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను వెల్లడించారు. తాజాగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు పరిశీలనలు జరుగుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా ఐదు సర్పంచులు, 81 వార్డులు, ఒక ఎంపీటీసీ స్థానం, సిరిసిల్ల మున్సిపాలిటీలో ఒక వార్డు కౌన్సిలర్ స్థానం ఖాళీగా ఉన్నాయి. ఇందుకు సంబంధించిన ఓటరు జాబితాను పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మే 7న సన్నాహాలకు సంబంధించి డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. 9వ తేదీన డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఇస్తారు. 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాలు, పరిశీలనలు చేస్తారు. 11వ తేదీన పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 18న అభ్యంతరాలను పరిష్కరిస్తారు. 21న జిల్లా ఎన్నికల అధికారి పరిశీలన, అనంతరం పోలింగ్ స్టేషన్ల జాబితాను వెల్లడిస్తారు. 24న తుది పోలింగ్ జాబితాను వెల్లడించనున్నారు. పోలీస్ స్టేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ రానుండడంతో పల్లెల్లో అశావహులు గెలుపుపై ఆశలు పెంచుకున్నారు. ఓటర్లను, పల్లె పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. పల్లెల్లో 16,416 మంది ఓటర్లు జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా వివిధ కారణాలతో 44 గ్రామ పంచాయతీల పరిధిలో 87 స్థానిక సంస్థల ఖాళీల్లో 16,416 మంది ఓటర్లను గుర్తించారు. ఇందులో పురుషులు 8091 మంది, మహిళలు 8325 మంది ఉన్నారు. జిల్లాలోని ఐదు సర్పంచ్ స్థానాలకు సంబంధించి 4842 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2424 మంది, మహిళలు 2418 మంది ఉన్నారు. ఇందులో వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్ తండాలో 502 మంది ఉండగా పురుషులు 255 మంది, మహిళలు 247 మంది, ఇల్లంతకుంట మండలం దాచారంలో 1791 మంది ఓటర్లు ఉండగా పురుషులు 881 మంది, మహిళలు 910 మంది, సోమారంపేటలో 983 మంది ఓటర్లు ఉండగా పురుషులు 489 మంది, మహిళలు 494 మంది, గొల్లపల్లిలో 430 మంది ఓటర్లు ఉండగా పురుషులు 225 మంది, మహిళలు 205 మంది ఉన్నారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో 1136 మంది ఓటర్లు ఉండగా పురుషులు 574 మంది, మహిళలు 562 మంది ఉన్నారు. 81 వార్డులు ఖాళీగా ఉండగా వాటి పరి?ధిలో 10,918 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 5391 మంది, మహిళలు 5527 మంది ఉన్నారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్ ఎంపీటీసీ స్థానంలో 2222 మంది ఓటర్లకు పురుషులు 1075మంది, మహిళలు 1147 మంది ఉన్నారు. జిల్లాలో 81 వార్డు సభ్యుల ఖాళీలు ఉండగా అందులో ఇల్లంతకుంట మండలంలో గొల్లపల్లి, దాచారం, సోమారంపేట, తంగళ్లపల్లిలో బద్దెనపల్లి, వీర్నపల్లిలో బావుసింగ్‌తండాలు ఉన్నాయి. ఇల్లంతకుంట మండలం గొల్లపల్లిలో గత గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ఎన్నికలను పూర్తిగా బహిష్కరించడంతో సర్పంచ్‌తోపాటు 8 వార్డులు ఖాళీ ఏర్పడ్డాయి. వీటికిపూర్తిగా ఎన్నికలు నిర్వహించనున్నారు. బోయినపల్లి మండలంలో దేశాయిపల్లిలో 7వ వార్డు, స్థంబంపల్లి 5వ వార్డు, కొదురుపాక 4వ వార్డు, మల్కపూర్ 6వ వార్డు, రామన్నపేట 8వ వార్డు, చందుర్తి మండలం బండపల్లిలో 5వ వార్డు, జోగాపూర్ 5వ వార్డు, కట్టలింగంపేట 8వ వార్డు, మల్యాల 11వ వార్డు, ఇల్లంతకుంట మండలం గూడెపల్లి 1వ వార్డు, గంభీరావుపేట మండలం దేశాయిపేట 5వ వార్డు, కోనరావుపేట మండలం బావుసాయిపేట 4వ వార్డు, ధర్మారం 1వ వార్డు, 7వ వార్డు, 9వ వార్డు, 10వ వార్డు, కనగర్తిలో 3వ వార్డు, 10వ వార్డు, మల్కపేట




1వ వార్డు, 8వ వార్డు, మంగళ్లపల్లెలో 1వ వార్డు, 3వ వార్డు, 5వ వార్డు, 7వ వార్డు, మరిమడ్లలో 2వ వార్డు, 5వ వార్డు, 7వ వార్డు, 9వ వార్డు, మర్తనపేటలో 5వ వార్డు, 4వ వార్డు, నిమ్మపల్లిలో 2వ వార్డు, నిజామాబాద్‌లో 8వ వార్డు, 11వ వార్డు, 12వ వార్డు, పల్లిమక్తలో 3వ వార్డు, 7వ వార్డు, 8వ వార్డు, సుద్దాలలో 2వ వార్డు, ముస్తాబాద్ మండలం అవునూర్‌లో 2వ వార్డు, గోపాల్‌పల్లి 5వ వార్డు, ముస్తాబాద్ 12వ వార్డు, తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌లో 9 వవార్డు, బద్దెనపల్లిలో సర్పంచ్‌తో పాటు మొత్తం 10 వార్డులకు ఎన్నికలకు జరగనున్నాయి. గండిలచ్చపేటలో 1వ వార్డు, జిల్లెల్లలో 12వ వార్డు, లక్ష్మీపూర్‌లో 4వ వార్డు, మల్లాపూర్ 1వ వార్డు, నేరేళ్లలో 3వ వార్డు, 9వ వార్డు, రాళ్లపేట 8వ వార్డు, 4వ వార్డు, తంగళ్లపల్లిలో 9వ వార్డు, వేణుగోపాల్‌పూర్ 4వ వార్డు, కస్బెకట్కూర్ 1వ వార్డు, నేరేళ్ల 2వ వార్డు వీర్నపల్లి మండలంలో గర్జనపల్లిలో 6వ వార్డు, శాంతినగర్‌లో 1వ వార్డు, వేములవాడ మండలంలో అరెపల్లిలో 5వ వార్డు, వేములవాడ రూరల్ మండలంలో మల్లారంలో 2వ వార్డు, 6వ వార్డు, మర్రిపల్లి 8వ వార్డు, తుర్కాశినగర్ 4వ వార్డు, వట్టెంల 8వ వార్డు, ఎల్లారెడ్డిపేట మండల నారాయణాపూర్‌లో 10వ వార్డులు ఖాళీ ఉన్నాయి. జిల్లాలోని ఇల్లంతకుంట మండలంలో గొల్లపల్లి, దాచారం, సోమారంపేట, తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి, వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్ తండా సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటితోపాటు ఉపసర్పంచ్ స్థానాలు కూడా ఖాళీ ఏర్పడ్డాయి. ఉపసర్పంచ్‌లలో బోయినపల్లి మండలం దేశాయిపల్లి, ఇల్లంతకుంట మండలం గుండెపల్లి, గంభీరావుపేట మండలం దేశాయిపేట, కొత్తపల్లి, కోనరావుపేట మండలం కనగర్తి, మర్తనపేట, వేములవాడ మండలం అరెపల్లి ఉపసర్పంచ్‌లు ఖాళీగా ఉన్నాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఎస్సీ రిజర్వ్‌గా ఉన్నా 26వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన వోటారికారి లక్ష్మీరాజం కొవిడ్ కారణంగా మృతిచెందారు. ఈ వార్డుకు కూడా ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు తుది ఓటరు జాబితాను రూపొందించింది. వార్డులో 1881 మంది ఓటర్లను గుర్తించగా పురుషులు 916 మంది, మహిళలు 964 మంది ఉన్నారు. ఒకరు జెండర్ ఓటరు ఉన్నారు.

# జీవాలకు ఊరట..

సిరిసిల్ల : రోజురోజుకు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో అడవుల్లో నీటి మడుగులు ఎండిపోతుండటంతో దాహార్తిని తీర్చుకోవడానికి అడవుల్లోని మూగజీవాలు అల్లాడుతున్నాయి. గత పది రోజులుగా ఎండలు బాగా ముదరడంతో గుక్కెడు నీటి కోసం వన్యప్రాణులు అడవుల్లో అణువనువూ గాలిస్తున్నాయి. మరోవైపు అడవుల్లో అంటుకుంటున్న ఎలుగడితో వన్యప్రాణులు, చిన్నచిన్న మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఒకవైపు మండిపోతున్న ఎండలు, మరోవైపు ఎండిన నీటిప్రవాహాలు, ఇంకోవైపు తరుముతున్న ఎలుగడితో అడవుల్లో వన్యప్రాణులకు రక్షణ లేకుండాపోయింది. వన్యప్రాణుల మనుగడకు ముప్పు..మంథని ప్రాంతంలోని అడవుల్లోని వాగులు, వంకలు ఎండిపోయి ఎడారులను తలపిస్తున్నాయి. తాగేందుకు నీళ్లు దొరకని పరిస్థితి నెలకొనడంతో వన్యప్రాణుల మనుగడకే ముప్పు ఏర్పడింది. ఇదే అదనుగా భావిస్తున్న వేటగాళ్లు రాత్రివేళల్లో లైట్లతో అలసి సొమ్మగిల్లిన జింకలు, కొండగొర్రెలు, మెకాలపై కత్తులు, బరిసెలతో దాడులు చేస్తున్నారు. వాటి మాంసాన్ని అమ్మి సొమ్ము చేసుకోవడం వారికి అలవాటుగా మారింది. వర్షాభావం, ఎండలు ముదరడంతో అడవుల్లో గలగలా పారే వాగులు, వంకలతోపాటు




మడుగులు, తొగులు పూర్తిగా ఎండిపోయాయి. నియోజకవర్గంలోని మంథని, మల్హర్, ముత్తారం, రామగిరి, కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, పల్మెల మండలాల్లోని అడవుల్లో వందల సంఖ్యలో ఉన్న వాగులు, ఒర్రెల్లో చుక్కనీరు లేకపోవడంతో వన్యప్రాణులతోపాటు ఇతర మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. మండుటెండల్లో చుక్క నీటికోసం పరితపిస్తున్న మూగజీవాలను అదను చూసి వేటగాళు బలిగొంటున్న తీరు ఆందోళనకు గురి చేస్తోంది. రాత్రి, ఉదయం వెళ్లలో ప్రధాన రహదారులపై ప్రయాణించే వారు సిగరేట్, బీడీలు తాగి రోడ్డుపక్కన పడవేస్తుండటంతో అడవుల్లో మంటలు అంటుకుంటున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి మండుతున్న ఎండల మధ్య మూగజీవాల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. వన్యప్రాణుల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదు. సాసర్ పిట్ల ఏర్పాటు..వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు మంథని రేంజ్ పరిధిలో పలుచోట్ల అడవుల్లో సాసర్ పిట్లను అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సాసర్ పిట్లలో వారానికి ఒకసారి ట్యాంకర్ ద్వారా నీటిని నింపుతున్నారు. ఈ నీటిని కొండగొర్లు, దుప్పులు, జింకలు, నీల్‌గాయి, సాంబర్‌లు, పక్షులు తాగి దాహార్తిని తీర్చుకుంటున్నట్లు వాటి కాలిగుర్తుల ద్వారా అధికారులు గుర్తించారు. సాసర్ పిట్ల ద్వారా అటవీప్రాంతాల్లోని వన్యప్రాణుల తాగునీటి కష్టాలు చాలావరకు తీరాయని అధికారులు పేర్కొంటున్నారు.

# విద్యార్థులకు కార్పొరేట్ వల

ఖమ్మం : పదో తరగతి పరీక్షలు పూర్తికాకముందే ఇంటర్ అడ్మిషన్లపై కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు దృష్టిసారించాయి. పదోతరగతి విద్యార్థుల సమాచారాలు, తల్లిదండ్రుల ఫోననెంబర్లు సేకరిస్తూ విద్యార్థులను వచ్చే విద్యాసంవత్సరంలో తమ కాలేజీల్లో చేర్చుకునేందుకు వల విసురుతున్నారు. ఈ క్రమంలో కమీషన్లకు ఆశపడుతున్న కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సమాచారాన్ని ప్రైవేటు విద్యాసంస్థల వారికి అందిస్తున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు మే 23నుంచి ప్రారంభమై జూన1తో ముగుస్తున్నాయి. ఈ ఏడాది కరోనా పరిస్థితి లేకపోవడంతో హైదరాబాద్‌లోని కార్పొరేట్, ఇంటర్ కళాశాలలతోపాటు ఉమ్మడి జిల్లాలోని పలు కళాశాలల వారు తమ అడ్మిషన్లను పెంచుకునేందుకు కార్యాచరణ ప్రారంభించాయి. పీఆర్వోలతో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడించడం, పిల్లలను తమ వైపునకు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. వచ్చిందంటే ప్రైవేటు కళాశాలల వద్ద పీఆర్వోల సందడి కనిపిస్తుండగా.. కొన్ని ప్రైవేట్ కళాశాలలు సిబ్బందితోనే అడ్మిషన్లు బుక్ చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఈ క్రమంలో పీఆర్వోలకు కమీషన్లు కూడా పోటీపడి పెంచుతున్నట్టు తెలుస్తోంది. ఒక్కో విద్యార్థికి రూ.5వేల నుంచి రూ.6వేలవరకు కమీషన అందే పరిస్థితి ఉండగా కొన్ని కాలేజీలు ఎక్కువసంఖ్యలో అడ్మిషన్లు ఇస్తే అదేస్థాయిలో కమిషనకూడా పెంచుతామని ఆఫర్లుకూడా ఇస్తున్నాయి. దీంతో కమీషన్లపై ఆశతో ప్రభుత్వ పాఠశలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా పదో తరగతి విద్యార్థుల జాబితాలు, వారి తల్లిదండ్రుల ఫోననెంబర్లను కళాశాలల యాజమాన్యాలకు అందిస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఇంటర్ కళాశాలలను పటిష్ఠంచేసేందుకు కార్యాచరణ చేస్తున్నా.. ప్రైవేటు కళాశాలల్లో అడ్మిషన్లు అయిపోయిన తర్వా త ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుండటం ఇబ్బంది కరంగా ఉం టోంది. పదోతరగతి పరీక్ష ఫలితాలు వచ్చేలోపే ప్రైవేటు కాలేజీల పీఆర్వోలు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ కాలేజీల్లో చదివితే ఎంఎస్, జేఈఈ మెయిన్స, అడ్వాన్స, నీట్ కోచింగ్ ఇస్తామని, సీటు గ్యారంటీ అని చెప్పి అడ్మిషన్లు చేయిస్తున్నారు. అయితే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఎలాంటి కోచింగ్‌లు లేకుండా కేవలం ఇంటర్ విద్యాబోధనే ఉండటంతో తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రైవేట్ కళాశాలల్లో చేర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. దాంతో ప్రైవేటు కాలేజీలకు ధీటుగా ఇంటర్ విద్యను బలోపేతం చేస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు.. మాటలుగానే మిగులుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందమైన భవనాలు, అన్ని అర్హతలున్న లెక్చరర్లు, ల్యాబ్‌లు, ,ఇతర సౌకర్యాలున్నా ఇంజనీరింగ్, మెడికల్ కోచింగ్‌లు లేకపోవడం కూడా ఇందుకు కారణమవుతోంది. ఖమ్మంజిల్లా పరిధిలో 17,592మంది విద్యార్థులు పదో తరగతి చదువుతుండగా, భద్రాద్రి జిల్లాలో 13,332మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. వీరంతా వచ్చే నెలలో పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులున్నారు. ఇప్పటికే వీరి సమాచారమంతా ప్రైవేటు కాలేజీ చెంతకు చేరింది. దీంతో హైదరాబాద్, ఉమ్మడిజిల్లాలోని పలు కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు స్కూళ్లకు వెళ్లి ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కలిసి విద్యార్థులను తమ కళాశాలల్లో చేర్పాలని పరీక్షలకు ముందే వల విసురుతున్నారు. గత ఏడాది కరోనా పరిస్థితులతో హైదరాబాద్‌లోని కళాశాలల్లో చేరేందుకు ఉమ్మడి జిల్లా విద్యార్థులు అంతగా ఆసక్తి చూపలేదు. స్థానిక కాలేజీలకే ప్రాధాన్యమిచ్చారు. ప్రస్తుతం కరోనా పరిస్థితులు పూర్తిగా తగ్గడంతో ఇప్పుడు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల చూపు కొత్తగూడెం, ఖమ్మంతోపాటు హైదరాబాదులోని కార్పొరేట్ కళాశాలలపై పడింది.




# ప్రస్తుతానికి ముందుకెళ్లడం లేదు..!

విశాఖపట్నం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికిప్పుడు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని భావించడం లేదన్నారు. నగరంలోని పోర్టు కళావాణి స్టేడియంలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫగ్గన్‌సింగ్ కులస్తే మాట్లాడుతూ.. "ఇప్పటికిప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని అనుకోవడం లేదు. దీనిపై ప్రస్తుతానికి ముందుకెళ్లడం లేదు. దానికంటే ముందు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)ను బలోపేతం చేసే పనిలో ఉన్నాం. స్టీల్ ప్లాంట్‌లో కొన్ని కొత్త విభాగాలు ప్రారంభిస్తున్నాం. ముడిసరకు పెంపొందించే ప్రక్రియపై దృష్టి పెట్టాం. పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు ప్లాంట్ పనిచేసే ప్రక్రియ జరుగుతోంది. దీనిపై ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తాం. ఆర్ఐఎన్ఎల్ అధికారులతో భేటీ అవుతున్నాం. తెలంగాణ ప్రభుత్వం బిడ్డింగ్‌లో పాల్గొనడం ఓ ఎత్తుగడ మాత్రమే" అని ఆయన వ్యాఖ్యానించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయంపై గతకొంతకాలంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రైవేటీకరణను భాజపా మినహా దాదాపు అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.



# ముఖ్యమంత్రిని కలిసిన ఎన్‌సీసీ డీజీ లెఫ్టినెంట్ జనరల్

తాడేపల్లి: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్‌సింగ్ తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. ఏపీలో ఎన్‌సీసీ సేవలను మరింత విస్తరించడంతో పాటు, ప్రత్యేకంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ కూడా ఏర్పాటుచేయనున్నట్లు ముఖ్యమంత్రికి ఎన్‌సీసీ డీజీ వివరించారు. ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహకారాన్ని అందించనున్నట్లు సీఎం వైయస్ జగన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి జి.వాణీ మోహన్, ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఏపీ, తెలంగాణ) ఎయిర్ కమాండర్ పి.మహేశ్వర్, కల్నల్లు వి.వి.శ్రీనివాస్, వివేక్ షీల్, స్టాఫ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రిజ్ రాజ్ సింగ్, లైజన్ ఆఫీసర్స్ వి.సత్యం, పి.శ్రీనివాసరావు కలిశారు.

# అమరావతి పేదల ఇళ్ళ స్థలాల కేసులో సుప్రీం సానుకూలత

ఢిల్లీ: గుంటూరు, కృష్ణా జిల్లాల్లో పేదలకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. అమరావతిలో పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలన్న సీఎం జగన్ సంకల్పాన్ని అడ్డుకునే టీడీపీ యత్నానికి కోర్టులో బ్రేకు పడింది. ఈ కేసులో సుప్రీం కోర్టు సానుకూలత ప్రదర్శించింది. 'మీ 35 సెంట్ల భూమి నుంచి పేదలకు స్థలం ఇస్తున్నారా?. 75 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే మీకు వచ్చే నష్టం ఏంటి?' అంటూ పిటిషనర్‌పై సుప్రీం కోర్టు సీరియస్ అయినట్లు సమాచారం. అలాగే.. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై స్టే ఇవ్వాలన్న పిటిషన్‌ను విచారణకు నిరాకరించింది సుప్రీం. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. దీంతో చేసేది లేక పిటిషన్‌ను ఉపసంహరించుకున్నాడు టీడీపీ సానుభూతిపరుడు శివ. అమరావతి రాజధాని ప్రాంతాల్లో వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నది సీఎం వైఎస్ జగన్ సంకల్పం. ఈ ప్రయత్నాలను టీడీపీ అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. అమరావతిలో పేదలకు స్థానం లేదని కోర్టుల ద్వారా అడ్డుపడే ప్రయత్నం చేశారు. పేదలకు ఇళ్ల స్థలాల ఇవ్వాలన్న జీవో పై స్టే ఇవ్వాలని అడిగారు. మీకు ప్లాట్లు ఇస్తున్నప్పుడు దీన్ని ఎందుకు అడ్డుకుంటున్నారు అని సుప్రీం కోర్టు అడిగింది. పిటిషన్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. పేదలకు సెంట్ భూమి ఇస్తే ఎందుకు కడుపు మంట. సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, గత్యంతరం లేక పిటిషన్ విత్ డ్రా చేసుకున్నారు. సీఆర్‌డీఏ చట్టం ప్రకారం పేదలకు 5శాతం ఇళ్ల స్థలాలు



ప్రభుత్వం ఇస్తుంది అని అడిషనల్ అడ్వకేట్ జనరల్ సుధాకర్ రెడ్డి తెలిపారు. చట్టం ప్రకారం పేదలకు అయిదు శాతం ఇవ్వాల్సిందే. కానీ గత ప్రభుత్వం దీన్ని విస్మరించింది. అయితే వైఎస్ జగన్ ప్రభుత్వం జీవో 45 ద్వారా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించింది. మాస్టర్ ప్లాన్ సవరణ చేసి ఆర్-5 జోన్ ఏర్పాటు చేశారు. సీఆర్‌డీఏ చట్టం ప్రకారమే వీటిని ఇచ్చారు అని ఏపీ ప్రభుత్వ స్పెషల్ జీపీ కాసా జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. అమరావతి కేసులో మంచి నిర్ణయం జరిగింది. పేదలకు ఇళ్ల ఇవ్వకుండా చేసిన ప్రయత్నాలు నెరవేరలేదు. వైఎస్ జగన్ పేదల కోసం తీసుకున్న నిర్ణయాలు సఫలపవుతయి అని అడ్వకేట్ జానకీ రామయ్య పేర్కొన్నారు.



# బఠిండాలో మళ్లీ కలకలం

## బుల్లెట్ గాయంతో మరో జవాను మృతి

చండీగఢ్: పంజాబ్‌లోని అత్యంత కీలకమైన బఠిండా సైనిక స్థావరంలో కాల్పులు జరిగిన కొద్ది గంటల్లోనే చోటు చేసుకొన్న మరో ఘటనలో ఒక జవాను ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం సాయంత్రం ఓ జవాను బుల్లెట్ గాయంతో మృతిచెందినట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు. అయితే, తాజా ఘటనకు అంతకుముందు జరిగిన కాల్పులతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అయితే, ఈ జవాను ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ఏదైనా ప్రమాదం జరిగిందా? అన్నదానిపై స్పష్టత లేదు. ప్రమాదవశాత్తూ తుపాకీ పేలడంతో అతడు మరణించి ఉంటాడని ఆర్మీ అధికారులు అనుమానిస్తున్నారు. మృతుడిని సెంట్రీ విధులు నిర్వర్తిస్తున్న లఘు రాజ్ శంకర్‌గా గుర్తించారు. శంకర్ ఏప్రిల్ 11నే సెలవులు పూర్తిచేసుకుని వచ్చి తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు వెల్లడించారు. "బుధవారం సాయంత్రం సెంట్రీ విధుల్లో ఉన్న శంకర్ కుడి కణతి వద్ద బుల్లెట్ గాయంతో విగతజీవిగా కన్పించాడు. అతడి పక్కనే సర్వీసు రివాల్వర్ పడిపోయి ఉంది. అతడు ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చు.. లేదా ప్రమాదవశాత్తూ తుపాకీ పేలి చనిపోయే అవకాశం కూడా ఉంది" అని ఆర్మీ ఓ ప్రకటనలో వెల్లడించింది. బఠిండా సైనిక స్థావరంలో బుధవారం తెల్లవారుజామున కాల్పులు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఆగంతకులు జరిపిన దాడిలో నలుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల శబ్దం వినిపించగానే సత్వర ప్రతిస్పందన బృందాలు అప్రమత్తమై ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకొని గాలింపు చేపట్టాయి. దుండగులు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. వారి కోసం వేట కొనసాగుతోంది. కుర్తా పైజామా ధరించి, ముఖానికి మాస్కులతో వచ్చిన దుండగులు ఈ కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే మరో జవాను బుల్లెట్ గాయంతో మరణించడం గమనార్హం.

# రాహుల్ గాంధీపై మరో పరువు నష్టం కేసు నమోదు

ముంబయి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తాజాగా మరో పరువు నష్టం కేసు నమోదవ్వటం దేశ రాజకీయాల్లో కలకలం సృష్టిస్తోంది. ఇటీవల ఆయన లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ వీర్ సావర్కర్ పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలకు స్పందించిన సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ పుణెలోని ఓ కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత నిరాధారంగా తన తాత సావర్కర్‌పై ఆరోపణలు చేశారని సత్యకి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక గొప్ప వ్యక్తిపై రాహుల్ తప్పుడు ఆరోపణలు చేశారనడానికి తన వద్ద ఆధారాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలు నిజమని కోర్టులో నిరూపించాలని సవాల్ విసిరారు. 'మోదీ' ఇంటిపేరుపై చేసిన వ్యాఖ్యల కారణంగా కాంగ్రెస్ అగ్రనేతపై ఇప్పటికే పరువు నష్టం కేసు నమోదైన విషయం తెలిసిందే. సూరత్ కోర్టు రాహుల్‌ను దోషిగా తేల్చి రెండేళ్ల జైలు శిక్ష కూడా విధించటంతో.. ఎంపీ పదవిని కూడా కోల్పోయారు. ఇదే విషయంలో ఇటీవల పట్నాలోనూ ఆయనపై పరువు నష్టం కేసు నమోదైంది. విచారణకు హాజరు కావాలని పట్నా కోర్టు రాహుల్‌కు నోటీసులు జారీ చేసింది.




# బీబీసీ ఇండియాపై ఈడీ కేసు నమోదు

దిల్లీ: ప్రముఖ మీడియా సంస్థ బీబీసీ ఇండియాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. విదేశీ నిధుల వ్యవహారంలో ఫెమా నిబంధనలను ఉల్లంఘించినట్లు పేర్కొంది. ఈ కేసులో భాగంగా ఆర్థిక లావాదేవీల వివరాలు సమర్పించాలని బీబీసీ ఇండియాను ఆదేశించింది. అలాగే విదేశీ రెమిటెన్సుల (ప్రవాసుల నుంచి అందిన నిధులు) వివరాలను పరిశీలిస్తున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. బీబీసీ ఇండియా కార్యాలయంలో కొద్ది నెలల క్రితం ఐటీ శాఖ తనిఖీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. కొన్ని రోజుల పాటు నిర్వహించిన ఆ తనిఖీలను.. 'సోదాలు కాదు.. సర్వే' అని అధికారులు పేర్కొన్నారు. అయితే, గోద్రా మారణకాండ వెనక నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోదీ ప్రమేయం ఉందంటూ బీబీసీ ఓ వివాదాస్పద డాక్యుమెంటరీని ప్రసారం చేసిన కొద్ది రోజుల తర్వాత ఈ తనిఖీలు చోటుచేసుకోవడం గమనార్హం. గుజరాత్ అల్లర్లలో మోదీ హస్తం ఉందని 'ఇండియా: ద మోదీ క్వశ్చన్' పేరిట రెండు భాగాలుగా ఇటీవల విడుదలైన డాక్యుమెంటరీలో బీబీసీ పేర్కొంది. దీనిపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అల్లర్లపై న్యాయస్థానాల్లో మోదీకి క్లీన్‌చిట్ లభించాక ఇలా అభాండాలు వేయడమేమిటని భాజపా అభ్యంతరం తెలిపింది. దీనికి సంబంధించిన లింకుల్ని కేంద్రం సామాజిక మాధ్యమాల్లో నిషేధించింది.

# ఆ విషయం హరీష్‌రావుకు తెలీదా?.. రామకృష్ణ వ్యంగ్యాస్త్రాలు

అమరావతి: ఏపీ, తెలంగాణలో అభివృద్ధిపై రెండు తెలుగు రాష్ట్రాల మంత్రుల మధ్య మాటల యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తనదైన రీతిలో స్పందించారు. ఆంధ్రాలో అభివృద్ధి లేదన్న తెలంగాణ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో అభివృద్ధి సాధించిన విషయం హరీష్ రావుకు తెలీదా? అని యెద్దేవా చేశారు. భారతదేశంలో జగన్‌మోహన్ రెడ్డి కన్నా ఎక్కువ ఆస్తులున్న ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా? అని అన్నారు. ఆదానీకి ఏపీలోని పోర్టులు, విద్యుత్ ఒప్పందాలు, వేలాది ఎకరాల భూములు కట్టబెట్టి ఆదానీని అభివృద్ధి చేయటం కనపడలేదా? అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మెడలు వంచి ఏపీకి ప్రత్యేక హెూదా, విభజన హామీలు సాధిస్తానన్న జగన్మోహన్ రెడ్డి మాట తప్పి, మడమ తిప్పటం గమనించలేదా? అని అడిగారు.



ఇన్నింటిలో అభివృద్ధి కనబడుతున్నా ఏపీలో అభివృద్ధి లేదని హరీష్ రావు చెప్పటం హాస్యాస్పదమంటూ హరీష్‌రావు వ్యాఖ్యలను తప్పుబడుతూనే... వైసీపీ ప్రభుత్వంపై రామకృష్ణ చురకలంటించారు.

# నిమ్మకూరులో ఆలోచింప చేస్తూ ఆకట్టుకుంటున్న స్లోగన్లు



కృష్ణా: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఉమ్మడి కృష్ణా జిల్లా పర్యటన రెండో రోజుకు చేరుకుంది. గత అర్ధరాత్రి మచిలీపట్నంలో సభ ముగిసన తర్వాత ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులో చంద్రబాబు బస చేశారు. ఈరోజు నిమ్మకూరులో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను చంద్రబాబు ప్రారంభించరు. ఈ క్రమంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా నిమ్మకూరులో ఏర్పాటు చేసిన బ్యానర్లపై స్లోగన్లు అందరినీ ఆలోచింప చేస్తూ ఆకట్టుకుంటున్నాయి. "చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం, చంద్రన్నే చిన్నారుల భవిష్యత్తుకు సంకేతం" అంటూ చిన్నారుల ఫొటోలతో మా భవిష్యత్తుకి మీరే భరోసా అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అలాగే "అభిమానించే స్థాయి నుంచి ఆరాధించే స్థాయికి ఎదిగారు. ఎవరో గొప్పగా చెబితే వచ్చిన కీర్తి కాదు మీది. ఎవడో ఏదో వాగితే తగ్గే స్థాయి అంతకంటే కాదు మీది" అంటూ చంద్రబాబు ఫొటోతో అభిమానులు బ్యానర్లను ఏర్పాటు చేశారు. టీడీపీ అభిమానులు ఏర్పాటు చేసిన ఈ బ్యానర్లు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు మచిలీపట్నంలో బహిరంగ సభ అనంతరం నిమ్మకూరులో గత రాత్రి బస చేసిన చంద్రబాబు... మరి కొద్దిసేపట్లో ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించనున్నారు. అనంతరం నిమ్మకూరు గ్రామస్తులతో చంద్రబాబు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. గ్రామస్తులకు బట్టలు పెట్టనున్నారు. నిమ్మకూరులో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను చంద్రబాబు ప్రారంభించనున్న నేపథ్యంలో నందమూరి కుటుంబసభ్యులు ఇప్పటికే నిమ్మకూరు చేరుకున్నారు. నందమూరి రామకృష్ణ, హరికృష్ణ కుమార్తె సుహాసిని గతరాత్రి నిమ్మకూరుకు వచ్చారు. ఈరోజు చంద్రబాబుకు నందమూరి రామకృష్ణ, సుహాసిని బట్టలు పెట్టనున్నారు. అనంతరం నిమ్మకూరు నుంచి గుడివాడలో చంద్రబాబు బయలుదేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం నుంచి బయలుదేరి గుడివాడలో రోడ్ షో, బహిరంగం సభలో అధినేత పాల్గొంటారు. మరోవైపు నిమ్మకూరు గ్రామం మొత్తం పసుపు తోరణాలు, జెండాలతో అభిమానులు అలంకరించారు. ఎన్టీఆర్, చంద్రబాబు ఫోటోలతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

# జగన్ రెడ్డి సర్కార్ పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వం..




గుంటూరు జిల్లా: టీడీపీ నేత, మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణ జగన్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ సాగర్ కుడి కాలువకు నీటి కోసం ప్రభుత్వానికి డెడ్ లైన్ పెట్టారు. రెండు రోజులలో కుడి కాలువకు నీరు విడుదల చేయాలని.. ప్రభుత్వం స్పందించపోతే సత్తెనపల్లిలో రైతులతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. జగన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని, సాగర్ కుడి కాలువకు నీరు నిలిపివేతే దీనికి నిదర్శనమన్నారు. చివరి తడికి నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి పారుదల శాఖ మంత్రి బాధ్యత లేకుండా ఉన్నారని, స్వంత జిల్లాలో రైతుల గురించి పట్టించుకోవడం లేదని, రైతులపై సీఎం జగన్ రెడ్డి కక్ష కట్టినట్లుగా ఉందని కన్నా లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు.

# 'ఆర్థిక బలం లేదన్న జగన్.. రూ.510కోట్ల ఆస్తులపై ఏం చెప్తారు?'

అమరావతి: ముఖ్యమంత్రి జగన్, అబద్ధాలు కవల పిల్లలు అని ఏపీ కాంగ్రెస్ కమిటీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పడం జగన్‌కు పరిపాటి అయిందన్నారు. తనకు ఆర్థిక బలం లేదని ఇటీవల ముఖ్యమంత్రి బహిరంగ సభలో చెప్పారన్నారు. అయితే దేశంలోని 30 మంది ముఖ్యమంత్రులలో అత్యంత సంపన్నుడు జగన్మోహన్ రెడ్డి, అత్యంత పేదరాలు మమత బెనర్జీ అని ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. 2019 ఎన్నికల అఫిడవిట్ వివరాల ఆధారంగా జగన్ ఆస్తి విలువ రూ.510 కోట్లు అని.. మిగతా 29 మంది ముఖ్యమంత్రుల ఆస్తి విలువ కూడిన జగన్ కంటే తక్కువే అని చెప్పుకొచ్చారు. తనకు మీడియా బలం లేదని, జగన్ బహిరంగ సభలో చెప్పారని... సాక్షి దినపత్రిక, సాక్షి టీవీ జగన్‌వే అని అందరికీ తెలుసన్నారు. బొంకర బొంకర పొలిగా అంటే టంగుటూరి మిరియాలు



తాటికాయంత అన్నట్లున్నాయి జగన్ మాటలు ఉన్నాయని యెద్దేవా చేశారు. ఇప్పటికైనా అబద్ధాలు చెప్పడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జగన్‌కు సూచిస్తోందని తులసిరెడ్డి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ధన్యవాదాలు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ట్వీట్ చేశారు. తెలంగాణ నుంచి ఒక బృందాన్ని పంపి.. వైజాగ్ స్టీల్ ఈవోఐలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నందుకు కేసీఆర్ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కేసీఆర్ నిర్ణయంతో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వెళ్లకూడదని, ఆర్ఐఎన్ఎల్‌ను బలోపేతం చేయాలని కేంద్రం ఆలోచించడానికి కారణమైందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బిడ్‌లో పాల్గొనాలని లక్ష్మీనారాయణ సూచించారు. కేసీఆర్ పోరాటంతో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్రం వెనుకడుగు వేసిన సంగతి తెలిసిందే. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణపై ముందుకు వెళ్లడం లేదని కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ ప్రకటన విడుదల చేశారు. పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు ప్లాంట్ పని చేసే ప్రక్రియ జరుగుతోందని కేంద్రమంత్రి ప్రకటించారు. ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామన్నారు.

## హాలీవుడ్ 'ఎఫ్-9' స్టార్ తో పీసీ రొమాన్స్!

హాలీవుడ్ లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. 'సీటాడెల్' సిరీస్ కోసం ప్రపంచ దేశాల్నే చుట్టేస్తుంది. ఈ సిరిస్ సక్సెస్ అయితే అమ్మడి క్రేజ్ వరల్డ్ వైడ్ మరింత రెట్టింపు అవుతుంది. ఇప్పటికే ఓ వైపు హాలీవుడ్ సినిమాల తో..మరోవైపు అవార్డు వేడుకల్లో భాగంగా ప్రపంచ వేదికల్నే అబ్బుర పరిచింది. ఓ భారతీయ నటి విదేశాల్లో అంతగా ఫేమస్ అవ్వడం అన్నది సినిమా చరిత్రలో మొట్ట మొదటిసారి. కొన్ని కారణాలతో భారతీయులు ఆమెని వ్యతిరేకించినా? భారతదేశం గురించి విదేశాల్లోనూఏ ఎలుగెత్తు చాటిన నటిగా చెప్పొచ్చు. 'క్వాంటికో' నుంచి 'సీటాడెల్' వరకూ పెద్ద తెర..బుల్లి తెరను సైతం ఏలేసింది. ఇప్పుడు



ఏకంగా వరల్డ్ ఫేమస్ స్టార్స్ తో కలిసి సినిమాలు చేస్తుంది. త్వరలో 'ఎఫ్ -9' స్టార్ తో ఓ సినిమా చేస్తుంది. ఎవెంజర్స్ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన ఇద్రిస్ ఎల్బా.. ఎఫ్ -9 సినిమాలో నటించిన జాన్ సెనాతో కలిసి పీసీ రొమాన్స్ చేయబోతుంది. 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే సినిమాలో ఈ త్రయం కనిపించనుంది.

ఈ చిత్రాన్ని ఇలియా నైషుల్లర్ తెరకెక్కిస్తున్నారు. పీటర్ సప్రాన్.. జాన్ రికార్డర్ ఈసినిమాని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో అవకాశం పట్ల ప్రియాంక చోప్రా ఎంతో ఎగ్జైట్ మెంట్ ఫీలైంది. అరుదైన నటులుతో..అరుదుగా నటించే అవకాశం వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేసింది. 'సీటాడెల్' తర్వాత నేను చేయబోతున్న ప్రాజెక్ట్ అంటూ గర్వంగా ప్రకటించింది. అలాగే భారతదేశంలో 'సీటాడెల్' కోసం ప్రత్యేకంగా ప్రచారం లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సీటాడెల్ రిలీజ్ తర్వాత ప్రపంచ మంతా పర్యటిస్తామని తెలిపారు. మొత్తానికి ప్రియాంక రేంజ్ హాలీవుడ్ లో రోజు రోజుకి పెరిగిపోతుందని చెప్పొచ్చు. హాలీవుడ్ లో సినిమా ఛాన్స్ అంటే అంత ఈజీ కాదు. ఎంతో అనుభవంతో పాటు..చాలా విషయాల పట్ల అవగాహన ఉంటే గానీ రాని అవకాశాలు. పీసీ తర్వాత అలాంటి అవకాశాలు తెలుగు నటుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కి వస్తున్నాయి. 'ఆర్ ఆర్ ఆర్' సక్సెస్ కం గుర్తింపుతో హాలీవుడ్ మేకర్స్ స్వయంగా చరణ్ కి ఆహ్వానం పలుకుతోన్న సంగతి తెలిసిందే.

## నాగార్జున డ్యూయల్ రోల్.. కానీ ఆ ఒక్కటి సస్పెన్స్!

కింగ్ నాగార్జునకి ద్విపాత్రాభినయం కొత్తేం కాదు. హీరోగా ఎంట్రీ ఇచ్చిన కొత్తలోనే డ్యూయల్ రోల్ లో కనిపించారు. అటు పై అవసరం మేర పలు సినిమాల్లో ఆ తరహా పాత్రల్లో మెప్పించిన సందర్భాలెన్నో. రీసెంట్ విజయాల్లో 'సొగ్గాడే చిన్ని నాయనా' ఒకటి. ఈ సినిమాలో నాగ్ ద్విపాత్రాభినయం ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది. సినిమా విజయంలో నాగ్ రెండు పాత్రలు ఎంతో కీలక పాత్ర పోషించాయి. ఈ నేపథ్యంలో నాగార్జున మరోసారి కొత్త సినిమాలోనూ ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు తెలుస్తోంది. రచయిత బెజవాడ ప్రసన్న కుమార ని దర్శకుడిగా పరిచయం చేస్తూ నాగార్జున ఓ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇది పిరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ సినిమా. ఇటీవల ఈ జానర్ సినిమాలకు ఆదరణ బాగుండటంతో? సినిమా పై అంచనాలు భారీగా ఏర్పడుతున్నాయి. ఇందులో నాగార్జున రెండు విభిన్న పాత్రలు పోషిస్తున్నట్ల తెలుస్తుంది. అందులో ఓ పాత్ర మధ్య వయస్కుడిగా నటిస్తున్నట్లు సమాచారం.



అంటే 40-50 ఏఊళ్ల వయసున్న పాత్రలో తెలుస్తుంది. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకంగా ఉంటుందని యూనిట్ వర్గాల సమచారం. ఇదే పాత్రలో గ్రేషేడ్ కూడా కనిపిస్తుందిట. ఆ పాత్ర లుక్ మాసివ్ గా ఉంటుందని తెలుస్తుంది. ఆ పాత్రకి సంబంధించిన గెటప్ కోసం విదేశీ నిపుణులు పనిచేస్తున్నారుట. అయితే మరో పాత్రకి సంబంధించి ఎలాంటి అప్ డేట్ ఇంతవరకూ లీక్ అవ్వలేదు. దీంతో ఆ రోల్ ఎలా ఉండబోతుంది? అన్న ఎగ్జైట్ మెంట్ అభిమానుల్లో కనిపిస్తుంది. ఇటీవలి కాలంలో కంటెంట్ పరంగా నాగార్జున చాలా సెలక్టివ్ గా వెళ్తోన్న సంగతి తెలిసిందే. రొటీన్ కిభిన్నమైన సినిమాలు చేస్తున్నారు. పాత్రల పరంగా వైవిధ్యం కోరుకుంటున్నారు. ప్రసన్న కుమార్ ఆ కోవలోనే అక్కినేని కాంపౌండ్ లోకి రాగలిగారు. కింగ్ ని తన కథతో మెప్పించగలిగారు. ఇందులో ఓ పాత్రకి జోడీగా మాజీ మిస్ ఇండియా మానస వారణాసి నటిస్తోంది. మరో హీరోయిన్ కి ఛాన్స్ ఉంది. కానీ ఇంకా యూనిట్ కన్ఫమ్ చేయలేదు. ఈ చిత్రాన్ని శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు.




## స్టన్నింగ్ క్లీ వేజ్ షో తో జాన్వీ కపూర్ షాక్





అతిలోక సుందరి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి చాలా సినిమాల్లో నటించింది. కానీ ఇప్పటి వరకు హిందీలో ఈమె నటించిన సినిమాలు లేదా సిరీస్ ల్లో ఏ ఒక్కటి కూడా కమర్షియల్ గా హిట్ అవ్వలేదు. అయితే ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటో షూట్స్ తో పాన్ ఇండియా స్టార్ డమ్ ను దక్కించుకుంది. సినిమాలతో కంటే ఫోటో షూట్స్ తో ఎక్కువ పాపులారిటీని సొంతం చేసుకున్న హీరోయిన్ గా జాన్వీ కపూర్ నిలిచింది. ప్రస్తుతం ఎన్టీఆర్ కు జోడీగా కొరటాల శివ దర్శకత్వంలో నటిస్తుంది అంటే అది కేవలం ఇలాంటి హాట్ ఫోటోలను మరియు వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడమే అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

హాట్ ఫోటోల వల్ల మంచి పేరు వస్తుందనే ఉద్దేశ్యంతో జాన్వీ కపూర్ రెగ్యులర్ గా తన ఫోటో ల జోరు.. వేడి పెంచుతూనే ఉంది. ఆకట్టుకునే ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. తాజాగా మరోసారి క్లీవేజ్ షో తో మతి పోగొట్టింది. ఖరీదైన స్టైలిష్ హారంను ధరించిన జాన్వీ కపూర్ క్లీ వేజ్ షో తో చూపు తిప్పుకోవడం లేదు. మెడలో ఉన్న ఖరీదైన హారం కంటే కూడా ఆమె క్లీవేజ్ షో మరియు ఆమె చూపులు స్టన్నింగ్ గా ఉన్నాయంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు.

ఎన్టీఆర్ 30 సినిమా చిత్రీకరణ ఇటీవలే ప్రారంభం అయింది. వచ్చే షెడ్యూల్ లో జాన్వీ కపూర్ ఎన్టీఆర్ 30 సెట్స్ లో జాయిన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ వార్తలు వస్తున్నాయి. శ్రీదేవి కి అందం విషయంలో తల్లికి తగ్గ కూతురు అనిపించుకుంటుంది అనడంలో సందేహం లేదు. ఎన్టీఆర్ 30 సినిమా తర్వాత సౌత్ లో జాన్వీ కపూర్ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## 15 అంతస్తుల టవర్ నిర్మిస్తున్న స్టార్ కపుల్





అలియా భట్ ప్రస్తుతం అనేక విధులు నిర్వహిస్తోంది. వాటిలో ఒకటి డ్రీమ్ హౌమ్ (కలల ఇల్లు) నిర్మాణంలో పురోగతి పరిశీలన. ఆమె వారి కొత్త నివాసం నిర్మాణ స్థలం నుండి తిరిగి వస్తున్నట్లు కనిపిస్తున్న కొన్ని ఫోటోలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలియా చాలా సింపుల్ గా క్యాజువల్ స్ట్రీట్ వేర్ లుక్ లో కనిపించింది. ఆమె బేసిక్ వైట్ ట్యాంక్ టాప్ ను- బ్యాగీ జీన్స్ సన్ గ్లాసెస్ తో స్టైలిష్ గా కనిపించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. RRR నటిగా ఆలియా పేరు ఇటీవల మార్మోగుతోంది. అలియా - రణబీర్ ప్రస్తుతం తమ కుమార్తె రాహాతో కలిసి వారి కుటుంబ గృహమైన వాస్తులో నివసిస్తున్నారు. నిజానికి డిసెంబర్ 2022లో అలియా- రణబీర్ నిర్మాణ సైట్ నుండి తీసుకున్న స్నాప్ లు ఇంటర్నెట్ లో వైరల్ అయ్యాయి. నిర్మాణంలో ఉన్న ప్రాపర్టీని తనిఖీ చేస్తున్న సమయంలో వీరిద్దరూ అపార్ట్ మెంట్ లోని బాల్కనీలో కనిపించారు. ఆలియా టీమ్తో కలిసి ఇంటి గురించి ప్రశ్నిస్తూ కనిపించింది. మరోవైపు రణబీర్ కపూర్ సైట్ కి సంబంధించిన కొన్ని ఫోటోలను క్లిక్ చేశాడు. బాంద్రాలోని 15-అంతస్తుల టవర్ లో ఈ జంట కపూర్ కుటుంబానికి ఐదు అంతస్తులు కేటాయించినట్లు తెలుస్తోంది. మొత్తం భవంతి నిర్మాణం పూర్తి కావడానికి ఆరు సంవత్సరాలు పడుతుంది. అయితే మొదటి 5 అపార్ట్మెంట్లు ప్రాసెస్ లో ఉన్నాయి. టవర్ మొదటి - రెండవ అంతస్తుల అపార్ట్ మెంట్ లు దాదాపు నివాసానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి వరుసగా రణబీర్ కపూర్-ఆలియా భట్ - నీతూ కపూర్లకు చెందినవిగా భావిస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఆలియా భట్ రణబీర్ థియేట్రికల్ హిట్ బ్రహ్మాస్త్రలో కలిసి కనిపించారు. రణబీర్ చివరిసారిగా లవ్ రంజన్ కమర్షియల్ రొమాంటిక్ కామెడీ తు ఝూతి మైన్ మక్కార్ లో కనిపించాడు. తొలిసారి శ్రద్ధా కపూర్ అతడి సరసన నటించింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుండి మిశ్రమ స్పందన లభించింది. ఆ తర్వాత రణబీర్ యానిమల్ అనే చిత్రంలో నటించనున్నాడు. గతంలో షాహిద్ కపూర్ కబీర్ సింగ్ చిత్రానికి దర్శకత్వం వహించిన సందీప్ రెడ్డి వంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అలియా గురించి చెప్పాలంటే... ఆమె త్వరలో కరణ్ జోహార్ దర్శకత్వంలో రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీలో కనిపించనుంది.

బ్లాక్ బస్టర్ గల్లీ బాయ్ తర్వాత ఆమె రెండోసారి రణ్ వీర్ సింగ్ తో జతకట్టనుంది. OTT చిత్రం హార్ట్ ఆఫ్ స్టోన్ ద్వారా అలియా హాలీవుడ్ లోకి దూసుకెళుతోంది. గాల్ గాడోట్ - జామీ డోర్నన్ లతో కలిసి స్పేస్ నేపథ్యంలోని ఈ మూవీలో నటిస్తోంది. ప్రియాంక చోప్రా - కత్రినా కైఫ్ లతో కలిసి నటించిన జీ లే జరా ఆలియా ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ లలో మరొకటి.

**రామ్ చరణ్-ఉపాసనకు ఆలియా గిఫ్ట్ :** రామ్చరణ్-ఉపాసన తల్లిదండ్రులు కాబోతున్న వేళ ఈ జంటకు అరుదైన కానుకను పంపించింది ఆలియా భట్. ఆలియా Ed-a-Mamma వస్త్ర శ్రేణికి బ్రాండ్ అంబాసిడర్గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఎన్టీఆర్ పిల్లలకు దుస్తులు పంపించిన ఆలియా ఇప్పుడు రామ్ చరణ్ సతీమణి ఉపాసన కోసం అద్భుతమైన కానుకను పంపింది. ఈ జంటకు పుట్టబోయే బేబీకి సంబంధించిన దుస్తులను ఆలియా పంపించింది. ఈ విషయాన్ని స్వయంగా ఉపాసన సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ ఆలియాకు థ్యాంక్స్ చెప్పారు. ఆలియా ఆర్.ఆర్.ఆర్ లో చరణ్ సరసన సీత పాత్రలో నటించిన సంగతి తెలిసిందే.

## ఇన్ సైడ్... సమంత ఆ న్యూడ్ సీన్స్ కు ఓకే చెప్పిందా?

ప్రియాంక చోప్రా.. రిచర్డ్ మాడెన్ ముఖ్య పాత్రల్లో నటించిన హాలీవుడ్ సిరీస్ 'సిటాడెల్' ను ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 28వ తారీకున స్ట్రీమింగ్ చేయబోతున్నారు. తాజాగా సిటాడెల్ యొక్క ట్రైలర్ ను విడుదల చేయడం జరిగింది. ట్రైలర్ లో ప్రియాంక చోప్రా కొన్ని టాప్ లెస్ న్యూడ్ బ్యాక్ తో కనిపించింది. కొన్ని రొమాంటిక్ సన్నివేశాల్లో కూడా కనిపించబోతున్నట్లుగా ట్రైలర్ ను చూస్తూ అర్థం అవుతుంది. సిటాడెల్ ను ఇంగ్లీష్.. హిందీ తో పాటు ఇతర సౌత్ ఇండియన్ భాషల్లో విడుదల స్ట్రీమింగ్ చేయబోతున్నట్లుగా అమెజాన్ ప్రైమ్ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో సిటాడెల్ ను హిందీలో వరుణ్ ధావన్.. సమంత ప్రధాన పాత్రల్లో రీమేక్ చేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కార్యక్రమాలు కూడా జరిగినట్లు సమాచారం అందుతోంది. ఒరిజినల్ సిటాడెల్ కు చాలా మార్పులు చేర్పులు చేసి



హిందీలో రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రియాంక చోప్రా యాక్షన్ సన్నివేశాలతో పాటు రొమాన్స్ సన్నివేశాల్లో రెచ్చి పోయింది. కనుక ఆమె పాత్రలో నటించబోతున్న సమంత కూడా ఆ సన్నివేశాల్లో కనిపించబోతుందా అంటూ ఇప్పుడు సోషల్ మీడియాలో మరియు మీడియా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇండియా ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఆ సన్నివేశాలను మార్చే అవకాశాలు ఉన్నాయి అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు మాత్రం సమంత ఆ సెమీ న్యూడ్ సన్నివేశాల్లో నటించేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. గ్రాఫిక్స్ ను ఉపయోగించి ఆ సన్నివేశాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సమంత గత సిరీస్ ఫ్యామిలీ మ్యాన్ లో కాస్త ఎక్కువ బోల్డ్ గానే నటించింది. కనుక ఈ సిరీస్ లో అలా నటించడం లో ఇబ్బంది ఏమీ లేదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం సమంత యొక్క శాకుంతలం సినిమా యొక్క హడావుడి కొనసాగుతోంది. ఆ తర్వాత సిటాడెల్ సిరీస్ కు సంబంధించి సమంత హడావుడి మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి.

## ఆ ఇద్దరితో నయనతార టెస్ట్ ఆడుతుందా?

లేడీ సూపర్ స్టార్ గా నయనతార కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతుంది. సూపర్ స్టార్లే ఆమె డేట్లు కోసం ఎదురుచూస్తున్నారు? అంటే సన్నివేశం ఎలా ఉందో అర్ధమవుతుంది. నాటి రోజుల్లో సావిత్రి డేట్లు కోసం అప్పటి హీరోలు వెయిట్ చేసేవారు. ఆ తర్వాత తరం నటీమణుల్లో ఎవరి పేరు అంతగా ఖ్యాతికెక్కలేదు. తాజాగా నేటి తరం జనరేషన్ లో నయనతార పేరు మాత్రం యమా బిజీ హీరోయిన్ గా వినిపిస్తుంది. కేవలం తమిళ సినిమాలు తప్ప! ఇతర భాషల్లో సినిమాలు చేయడం చాలా అరుదుగానే కనిపిస్తుంది. షారుక్ ఖాన్ ఏరికోరి మరి 'జవాన్' కోసం ఎంపిక చేసారు. అందుకు భారీగా పారితోషికం చెల్లించి ప్రాజెక్ట్ లోకి తెచ్చారు. షారుక్ ఖాన్ కి ఉన్న ఇమేజ్ అంత అవసరమా? అంటే తమిళ్ లో మార్కెట్ చేయాలంటే? నయన్ తప్పనిసరిగా ఉండాల్సిందే అన్న కోణంలో లాక్ చేసారు. అదీ నయన్ రేంజ్ ఇప్పుడు. ఇటీవలే నయన్ 'కనెక్ట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. కానీ ఫలితం ఆశించిన విధంగా రాలేదు.



దీంతో కాస్త నిరుత్సాహం తప్పలేదు. దీంతో నయనతార తర్వాతి సినిమా పై ఆసక్తి నెలకొంది. కొత్త సినిమా ప్రకటన ఎప్పుడొస్తుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆ గుడ్ న్యూస్ వచ్చేసింది. ఈసారి ఏకంగా ఇద్దరి హీరోలోతో రొమాన్స్ కి రెడీ అయింది. మాధవన్ ..సిద్దార్ధ్ లతో కలిసి 'టెస్ట్' అనే సినిమా చేస్తుంది. వై నాట్ స్టూడియోస్కు చెందిన శశికాంత్ దర్శకత్వం వహించ నున్నారు. దర్శకుడిగా అతనికిదే తొలి సినిమా. చాలా కాలం పాటు నిర్మాతగా సేవలందించారు. ఇక పై క్రియేటివ్ గానూ రాణించాలని దర్శకుడిగా టర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ చివరి నాటికి సినిమా పట్టాలెక్కనుందని సమాచారాం. మరి ఇద్దరితో నయనతార టెస్ట్ ఎలా ఆడుతుందో చూడాలి. అలాగే టెస్ట్ రొమాంటిక్ జోనరా? కామెడీ జానర్? అన్నది ఇంకా ఖరారు కాలేదు. సిద్దార్థ్-మాధవన్ కలసి గతంలో రెండు సినిమాలు చేశారు. 'రంగ్ దే బసంతి'- 'యువ' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. శశికాంత్ గతంలో అనేక సినిమాలను నిర్మించారు. 'విక్రమ్ వేద'- 'మండేలా'- 'సూపర్ డీలక్స్' వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్ ప్రొడ్యూసర్ గా పేరుంది. టెస్ట్ తో కెప్టెనీ కుర్చీ బాధ్యతలు ఎంతవరకూ నెరవేరుస్తారో? చూడాలి.




# అగ్నిప్రమాదంలో కుట్ర కోణం ఉంటే దర్యాప్తులో తేలుతుంది: కేటీఆర్

హైదరాబాద్: ఖమ్మం జిల్లా చీమలపాడు అగ్నిప్రమాద బాధితులను మంత్రి కేటీఆర్ పరామర్శించారు. నిమ్స్‌కు వెళ్లిన మంత్రి.. వైద్యులతో మాట్లాడి బాధితుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న నలుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కేటీఆర్‌కి వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స అందించాలని మంత్రి వారికి సూచించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. చీమలపాడులో జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురి కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున.. క్షతగాత్రులకు రూ.2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను సీఎం కేసీఆర్ ప్రకటించినట్లు చెప్పారు. గాయపడిన భారాస కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ అగ్నిప్రమాదంలో కుట్రకోణం ఉందా? లేదా? అనే విషయం పోలీసు దర్యాప్తులో తేలుతుందని కేటీఆర్ అన్నారు.

# తెలంగాణ దళిత పారిశ్రామికవేత్తలు దేశానికే ఆదర్శంగా ఎదగాలి: మంత్రి కేటీఆర్




హైదరాబాద్: తెలంగాణ ఈరోజు ఆచరిస్తుంది.. రేపు దేశం అనుసరిస్తున్నదని మంత్రి మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీకొడుతున్నదని చెప్పారు. రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలను కేంద్రం కాపీ కొట్టిందన్నారు. రాష్ట్రంలో దళిత పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ దళిత పారిశ్రామికవేత్తలు దేశానికే ఆదర్శంగా ఎదగాలని సూచించారు. దళితులు ఆర్థికంగా ఎదుగుతుంటే ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. హైదరాబాద్ బేగంపేటలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకలకు మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు టీ ప్రైడ్ ద్వారా ప్రోత్సాహకాలు, అవార్డులు అందజేశారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం వల్లే తెలంగాణ వచ్చిందని చెప్పారు. అందరికీ ఒకే ఓటు హక్కు ఉండాలని బాబాసాహెబ్ ఆలోచించారని తెలిపారు. ఆయన ముందు చూపుతో స్త్రీలకు పురుషులతో సమానంగా ఓటు హక్కు వచ్చిందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని బోధించే మతమే తనకు ఆదర్శమని చెప్పారని వెల్లడించారు. దళితబంధు వంటి పథకాలను ప్రవేశపెట్టాలంటే సీఎం కేసీఆర్ లాంటి దమ్మున్న నాయకుడికే సాధ్యమన్నారు. దళితబంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నిండాయని, పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్నారని చెప్పారు. దళితబంధు యూనిట్లను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలని సూచించారు. తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తులు ఊహించనంతగా పెరిగాయన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత భూముల ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్‌ఇరిగేషన్ ప్రాజెక్టయిన కాళేశ్వరాన్ని నాలుగేండ్లలోనే నిర్మించుకున్నామని మంత్రి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక నదినే మలిపామన్నారు. ప్రాజెక్టు నీటితో రిజర్వాయర్లు కళకలాడుతుంటే విపక్ష నేతలకు కనిపించడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకోవడానికి ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు చేశాయన్నారు. సీఎం కేసీఆర్ మొండిగా ముందుకెళ్లి నాలుగేండ్లలోనే ప్రాజెక్టును పూర్తిచేశారని తెలిపారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని చెప్పారు. కుల, మత భేదాలు లేకుండా అందరినీ కలుపుకొని పోతేనే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

# టీ కాంగ్రెస్‌కు బిగ్ షాక్.. మహేశ్వర్ రెడ్డి రాజీనామా



హైదరాబాద్ : తెలంగాణకు కాంగ్రెస్‌కు ఈ మధ్య షాకుల మీద షాకులు తగులుతున్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీకి ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాజీనామా చేశారు. నేటి ఉదయమే ఢిల్లీకి చేరుకున్న మహేశ్వర్ రెడ్డి ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు యత్నిస్తున్నారంటూ తొలుత వార్తలొచ్చాయి. ఇంతలోనే పార్టీకి ఖర్గే తన రాజీనామా లేఖను పంపించేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని రోజులుగా మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. నిన్న క్రమశిక్షణ కమిటీ ఆయనకు షో కాజ్ నోటీస్ జారీ చేయడంతో మహేశ్వర్ రెడ్డి మనస్తాపానికి గురైనట్టు తెలుస్తోంది. "కాంగ్రెస్ పార్టీలో 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా.. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా.. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా వివిధ హోదాల్లో ఎన్నో ఆటంకాలను, అవరోధాలను ఎదుర్కొని పని చేశాను. ఎలాంటి ఆరోపణల్లేని మచ్చలేని చరిత్ర ఉన్న నేను.. ఏనాడూ పార్టీకి వ్యతిరేకంగా ప్రవర్తించలేదు. అయితే కాంగ్రెస్‌లో గత కొన్ని నెలలుగా జరుగ్నుతన్న రాజకీయ పరిణామాలను చూసి పార్టీలో నేను ఇమడలేనని అర్థమైంది. అందుకే కాంగ్రెస్‌లో ఇక ఎంత మాత్రం కొనసాగలేనని భావించి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా" అని మహేశ్వర్‌రెడ్డి రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఇక నిన్న ఆయన తనకు షోకాజ్ నోటీస్ జారీ చేయడంపై మీడియాతో మాట్లాడుతూ.. "ఏ రోజు నేను పార్టీ గీత దాటలేదు. అంతర్గత సమావేశాల్లో మాత్రమే నేను మాట్లాడినా. రేవంత్ వెలుమ కమ్యూనిటీ మీద మాట్లాడినప్పుడు మాత్రమే నేను మాట్లాడలేదు. ఇప్పటికీ రేవంత్ రెడ్డి అంటే నాకు అభిమానం. సీనియర్ల మీటింగ్ నా ఇంట్లో ఉంటే దిగ్విజయ్ కోరిక మేరకు వాయిదా వేశాం. జనరల్ సెక్రటరీని మార్చమని మేము ఎప్పుడూ కోరలేదు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటా. షోకాజ్ ఇవ్వడం బాధాకరం. ఖర్గేను కలిసి నిర్ణయం తీసుకుంటా. నేను పార్టీ మారాలంటే బాజాప్త రాజీనామ చేసి వెళతా. నేను పార్టీ మారాలని ఏ రోజు అనుకోలేదు. నా సమావేశాలకు బీజేపీ నేత అటెండ్ అయ్యారనే ది పచ్చి అబద్ధం. అమిత్ షాను బీజేపీ పెద్దలను కలిసేవారికి షోకాజ్ ఇచ్చే ధైర్యం లేదు. కానీ నాకు ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదు" అని పేర్కొన్నారు.

# సుఖేశ్‌తో నాకెలాంటి పరిచయం లేదు: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: ఆర్థిక మోసగాడు సుఖేశ్ చంద్రశేఖర్‌తో తనకెలాంటి పరిచయం లేదని భారాస ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. నకిలీ చాట్‌లతో తనపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేకనే తనపై ఇలా దాడికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. భారాసకు ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. "ఒక ఆర్థిక నేరగాడు అనామక లేఖ రాస్తే రాద్ధాంతం చేస్తున్నారు. ఆ లేఖను పట్టుకుని భాజపా ఎమ్మెల్యే రఘునందన్ సీఈసీకి లేఖ రాశారు. భాజపా టూల్‌కిట్‌లో భాగమే ఈ బురదచల్లే కార్యక్రమం. వాస్తవాలు తెలుసుకోకుండా పనిగట్టుకుని కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలు ప్రచురించాయి. పాత్రికేయులు కనీస విలువలు పాటించకపోవడం అత్యంత బాధాకరం" అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

# తెగించి కొట్లాడాం కాబట్టే కేంద్రం దిగొచ్చింది: మంత్రి కేటీఆర్



హైదరాబాద్: వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఇప్పటికిప్పుడు ప్రైవేటుపరం చేయాలని భావించడం లేదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే చేసిన వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్ స్పందించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపైన గట్టిగా మాట్లాడింది సీఎం కేసీఆరేనని తెలిపారు. తెగించి కొట్లాడాం కాబట్టే కేంద్రం తాత్కాలికంగా వెనక్కి తగ్గిందన్నారు. కేసీఆర్ దెబ్బ అంటే అట్లా ఉంటదని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై మంత్రి హరీశ్‌రావు స్పందిస్తూ.. కేసీఆర్ దెబ్బకు కేంద్రం దిగివచ్చిందన్నారు. ఇది భారాస, ఏపీ ప్రజలు, విశాఖ కార్మికుల విజయమని తెలిపారు. గురువారం విశాఖలో పర్యటించిన కేంద్ర మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇప్పటికిప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని అనుకోవడం లేదు. దీనిపై ప్రస్తుతానికి ముందుకెళ్లడం లేదు. దానికంటే ముందు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్)ను బలోపేతం చేసే పనిలో ఉన్నాం. స్టీల్ ప్లాంట్‌లో కొన్ని కొత్త విభాగాలు ప్రారంభిస్తున్నాం. ముడిసరకు పెంపొందించే ప్రక్రియపై దృష్టి పెట్టాం. పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు ప్లాంట్ పనిచేసే ప్రక్రియ జరుగుతోంది. దీనిపై ఆర్‌ఐఎన్‌ఎల్ యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తాం. ఆర్‌ఐఎన్‌ఎల్ అధికారులతో భేటీ అవుతున్నాం. తెలంగాణ ప్రభుత్వం బిడ్డింగ్‌లో పాల్గొనడం ఓ ఎత్తుగడ మాత్రమే" అని ఆయన వ్యాఖ్యానించారు.




# దేశంలోనే ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం - భూమి నుంచి 175 అడుగుల ఎత్తు స్మారకం
## పీఠం 50 అడుగులు, విగ్రహం 125 అడుగులు - నేడు ఆవిష్కరించనున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణకు సిద్ధమైంది. శుక్రవారం(14వ తేదీ) ఆవిష్కరణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో మహావిగ్రహ విశేషాలు.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ప్రారంభానికి సిద్ధమైంది. దేశంలో ఇప్పటివరకూ ఉన్న అంబేద్కర్ విగ్రహాల్లోకెల్లా ఎత్తయినదిగా హైదరాబాద్‌లో నిర్మించిన ఈ స్మారకం ఖ్యాతి గడించబోతోంది. పార్లమెంటు ఆకారంలో 50 అడుగుల పీఠం, ఆపైన 125 అడుగుల నిలువెత్తు లోహ విగ్రహాన్ని ఈ నెల 14న అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. హుస్సేన్‌సాగర్ తీరంలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యేలా రవాణా సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేసింది. అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు హాజరయ్యేలా 750 బస్సులను ఆయా ప్రాంతాలకు పంపనుంది. దాదాపు 50 వేల మంది కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది.

**125వ జయంతి సందర్భంగా ప్రకటన :** అంబేద్కర్ 125వ జయంత్యుత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో 125 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అమెరికాలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ తరహాలో నిర్మించి పర్యాటక, విజ్ఞాన ప్రదేశంగా తీర్చిదిద్దుతామని వెల్లడించింది. ఈ మేరకు రూ.146.50కోట్ల నిధులు కేటాయించింది. హుస్సేన్‌సాగర్ తీరంలో ఎన్టీఆర్ గార్డెన్‌ను ఆనుకుని దాదాపు 11.80 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. నిర్మాణ పనులకు ఎస్సీ సంక్షేమశాఖ నిధులు అందించగా, నిర్మాణ బాధ్యతను రోడ్లు, భవనాల శాఖకు అప్పగించింది. ఆ శాఖ ఈఎన్‌సీ ఈ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వ్యవహరించేలా మార్గదర్శకాలు జారీచేసింది. ఏడాదిలోగా నిర్మాణం పూర్తిచేయాలని అప్పట్లో నిర్ణయించినప్పటికీ..అధ్యయనం, నిర్మాణశైలి తదితర పనుల నేపథ్యంలో జాప్యం జరిగింది.

**ఢిల్లీలో తయారీ.. ఇక్కడికి తరలింపు :** కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థను ఎంపిక చేసి నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. స్తూపాన్ని నిర్మించిన తరువాత విగ్రహ భాగాలను ఢిల్లీలో సిద్ధంచేసి హైదరాబాద్‌కు తరలించారు. భారీ క్రేన్‌ల సహాయంతో వాటిని క్రమపద్ధతిలో అమర్చారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా తయారీలో పటిష్ఠ లోహ సామగ్రిని వినియోగించారు. విగ్రహం పాదాల వద్దకు చేరుకునేందుకు వీలుగా మెట్లమార్గం, ర్యాంపుతోపాటు 15 మంది ఎక్కగల సామర్థ్యంతో రెండు లిఫ్టులు ఏర్పాటుచేశారు.

**విజ్ఞానం..విశేషాల సమాహారంగా..** విగ్రహం కింద, పీఠం లోపల స్మారక భవనంలో 27,556 అడుగుల నిర్మిత స్థలం ఉంది. ఇక్కడే మ్యూజియం, అంబేద్కర్ జీవితానికి సంబంధించిన ముఖ్యమైన ఘటనలతో కూడిన ఫొటో గ్యాలరీ ఏర్పాటుకానుంది. భవనం లోపల ఆడియో విజువల్ రూమ్స్ ఉన్నాయి. ఈ గ్యాలరీ కోసం ఆ మహనీయుని జీవిత విశేషాలకు సంబంధించిన అరుదైన చిత్రాలను సమీకరించేందుకు ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీ మ్యూజియంతోపాటు గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయడంలో నిమగ్నమైంది. గ్రంథాలయంలో అంబేద్కర్ రచనలు సహా ఆయన జీవితానికి సంబంధించి ఏయే పుస్తకాలు అందుబాటులోకి తేవాలనే అంశంపై త్వరలో నిర్ణయం జరగనుంది. మూడు నెలల్లోగా ఈ ఏర్పాట్లు పూర్తికానున్నాయి. స్మారకం వెలుపల పచ్చదనం కోసం 2.93 ఎకరాల ఖాళీ స్థలం ఉంటుంది. స్మృతివనంలో రాక్‌గార్డెన్, ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, వాటర్ ఫౌంటేన్, శాండ్ స్టోన్ ఉన్నాయి. స్మృతివనంలో దాదాపు 450 వరకు కార్లను నిలిపే అవకాశం ఉంటుంది.

**బౌద్ధ గురువుల ప్రార్థనలు.. హెలికాప్టర్‌తో పూలవర్షాలు :** విగ్రహావిష్కరణ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. జీహెచ్‌ఎంసీ, రోడ్లు భవనాలు, రవాణా, విద్యుత్తు శాఖల అధికారుల సమన్వయంతో అతిథులకు సౌకర్యాలు కల్పిస్తోంది. రెండు లక్షల మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, 80 వేల స్వీటు ప్యాకెట్లు సిద్ధంచేస్తోంది. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా పీఠం లోపల ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌కు అవసరమైన కసరత్తు పూర్తయింది. విగ్రహావిష్కరణలో భాగంగా సీఎం కేసీఆర్ తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. సీఎంను దాదాపు 30 మంది బౌద్ధగురువులు ప్రార్థనలతో అక్కడికి తీసుకెళ్తారు. తర్వాత స్తూపం లోపల ఉన్న లిఫ్టులో ముఖ్యమంత్రి అంబేద్కర్ విగ్రహం పాదాల వద్దకు చేరుకుని నివాళులర్పిస్తారు. అక్కడ 20 మంది బౌద్ధ గురువులు ప్రార్థనలు నిర్వహిస్తారు. విగ్రహావిష్కరణ తరువాత హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపిస్తారు. అనంతరం అక్కడి బహిరంగ సభలో ఆహూతులను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తారు.

# బీజేపీకి రైతులంటే గిట్టదు.. అదో దొంగల పార్టీ: మంత్రి ఎర్రబెల్లి



వరంగల్/మహబూబాబాద్: బీజేపీ దొంగల పార్టీ అని, వారికి రైతులంటే గిట్టదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పేదలను దోచాలె.. పెద్దలకు కట్టబెట్టాలన్నదే మోదీ విధానమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ హయాంలోనే వ్యవసాయం పండుగలా మారిందని చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చిన మహాత్ముడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రతి ఎకరానికి నీళ్లు అందించిన ఘనత ముఖ్యమంత్రిదేనని వెల్లడించారు. వరంగల్, మహబూబాద్ జిల్లాల్లోని పాలకుర్తి, తొర్రూరు, పెద్దవంగరలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ ప్రక్రియ ఆరంభమైందని చెప్పారు. రైతుల కోసం మాత్రమే సీఎం కేసీఆర్ వేల కోట్లు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పంటల కోసం ఎదురుపెట్టుబడి పెడుతున్నదని వెల్లడించారు. రాష్ట్రంలో ఈ యాసంగిలో 7 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. గత వానా కాలంలో కోటి టన్నుల ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. రాష్ట్రంలో 24 లక్షల టన్నుల నుంచి కోటి 41 లక్షల టన్నులకు వరి ధాన్యం ఉత్పత్తి పెరిగిందని, వరి సాగు విస్తీర్ణం 65 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. గత ఎనిమిదేండ్లలో రూ.కోటి 7 లక్షల కోట్లను వరిధాన్యం సేకరణ కోసం పెట్టుబడి పెట్టామని తెలిపారు.

ఈ యాసంగిలో వరి ధాన్యం మద్దతు ధరను ఏ- గ్రేడ్ ధాన్యానికి రూ.2,060, బీ- గ్రేడ్ ధాన్యానికి రూ.2,040గా నిర్ణయించామన్నారు. రైతును రాజును చేయాలని సీఎం కేసీఆర్ ఆశిస్తున్నారని చెప్పారు.




దిల్లీ: దేశంలో కరోనా వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా 230 రోజుల అత్యధికానికి చేరాయి. కొత్తగా 2,29,958 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. 10,158 మందికి వైరస్ సోకినట్లు తేలిందని గురువారం కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ముందురోజు కంటే 30 శాతం మేర అధికంగా కేసులు నమోదయ్యాయి. పాజిటివిటీ రేటు 4.42శాతానికి చేరింది. వైరస్ వ్యాప్తి పెరుగుతుండటంతో క్రియాశీల కేసులు 44,998(0.10శాతం)కి చేరాయి. రికవరీ రేటు 98.71 శాతంగా ఉంది. ఇదిలా ఉంటే.. మన దేశంలో కొవిడ్ ఎండమిక్ దశకు చేరుకుందని బుధవారం అధికార వర్గాలు ప్రకటించాయి. ఈ క్రమంలో మరో 10-12 రోజులపాటు కేసుల ఉద్ధృతి కొనసాగుతుందని.. ఆ తరువాత తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం ఒమిక్రాన్, దాని ఉపరకమైన ఎక్స్‌బీబీ.1.16 కారణంగా కేసుల పెరుగుదల వేగంగా ఉన్నప్పటికీ.. వైరస్ తీవ్రత తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నాయి.

# విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై కేసీఆర్ పోరాటంతోనే కేంద్రం దిగివచ్చింది : మంత్రి హరీశ్‌రావు



వికారాబాద్ : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోరాటంతోనే కేంద్ర దిగివచ్చిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు గురించి కేసీఆర్, కేటీఆర్ నేను మాట్లాడం. కేసీఆర్ దెబ్బకు కేంద్రం దిగివచ్చి.. విశాఖ ఉక్కును అమ్మం.. బలోపేతం చేస్తామని కేంద్రం ప్రకటించింది. విశాఖ ఉక్కుపై ఏపీ అధికారపక్షం, ప్రతిపక్షం నోరు విప్పలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఏపీ ప్రజలు, కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేసింది. వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రంపై పోరు కొనసాగిస్తాం అని స్పష్టం చేశారు. ఇది కేసీఆర్ విజయం.. బీఆర్ఎస్ విజయం.. ఇది ఏపీ ప్రజల విజయం.. విశాఖ కార్మికుల విజయం అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com